



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక :125 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 9 జనవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :125 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 9 JANUARY 2025 PRICE : 5/- RS

*Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur*




# ఏపీ ఇక అభివృద్ధిలో దూసుకుపోతుంది

- విశాఖలో కూటమి సభ
- ఏపీ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని వెల్లడి
- ఏపీకి, చంద్రబాబుకు కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టీకరణ

వివరాలు 2లో..

## మోదీ నిర్దేశకత్వం, చంద్రబాబు నాయకత్వం... ఇదే మా పంథా



ఒక సదుద్దేశం, ఒక సదాశయం లేకుండా ఒకరు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిచినా అది ఒక నిరర్థకమైన నడకగా చరిత్రలో నిలిచిపోతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.. కానీ ఇంకొకరు ఒక సత్సంకల్పంతో, సదాశయంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలందరితో మమేకమై



## రాసి పెట్టుకోండి... ఢిల్లీ ఎన్నికల్లో గెలిచేది ఎన్డీయే

- విశాఖలో ప్రధాని మోదీ సభ
- రాష్ట్రానికి ఇవాళ చరిత్రలో మిగిలిపోయే రోజన్న సీఎం చంద్రబాబు
- ఇలాంటి శుభదినం తన జీవితంలో, రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిదని వెల్లడి



## రఘురామ చిత్రహింసల కేసు: విజయపాల్ ను ఒంగోలుకు తరలింపు

- గత ప్రభుత్వ హయాంలో రఘురామకు చిత్రహింసలు
- రిటైర్డ్ సీఐడీ అదనపు ఎస్పీ విజయ్ పాల్ అరెస్ట్
- ఒక్క రోజు పోలీస్ కస్టడీకి అప్పగించిన గుంటూరు కోర్టు

పెన్ పవర్ డెస్క్:ఏపీ అసెంబ్లీ డిప్యూటీ అసెంబ్లీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ సీఐడీ అదనపు ఎస్పీ విజయ్ పాల్ ను గుంటూరు కోర్టు ఒక్కరోజు పాటు పోలీస్ కస్టడీకి అప్పగించిన సంగతి తెలిసిందే. బుధవారం నుంచి గురువారం ఉదయం

వివరాలు 2లో..



## ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవు... ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం



- ఇంటర్ పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకొచ్చిన ఏపీ ప్రభుత్వం
- ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలను మాత్రమే బోర్డు నిర్వహిస్తుందని వెల్లడి
- సీబీఎస్ఈ విధానంతో ముందుకు సాగుతామన్న ప్రభుత్వం

వివరాలు 2లో..

## ఈ నెలాఖరు నుంచి ప్రజల్లోనే... జగన్ కీలక నిర్ణయం

- నెల్లూరు జిల్లా వైసీపీ నేతలతో జగన్ సమావేశం
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శలు
- చంద్రబాబు దుర్మార్గపు పాలనలో మనం ప్రజలకు అండగా ఉండాలని పిలుపు
- జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి నుంచి జిల్లాల పర్యటనకు వస్తానని వెల్లడి

వివరాలు 2లో..



## రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం...

- మార్చి నెలలో దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న స్కీమ్
- రోడ్డు ప్రమాదం జరిగిన ఏడు రోజుల వరకు వైద్యం
- వెల్లడించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



పెన్ పవర్ డెస్క్:రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందేలా చూడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం త్వరలోనే కొత్త పథకాన్ని అందుబాటు లోకి తీసుకురాబోతోంది. ఈ పథకం కింద రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యాన్ని పొందవచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఈ పథకం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగిన 7 రోజుల దాకా రూ. 1.5 లక్షల వరకు వైద్యాన్ని పొందే

వివరాలు 2లో..

## చంద్రబాబు భద్రత మరింత కట్టుదిట్టం.. అదనంగా కమెండోలతో కౌంటర్ యాక్షన్ టీమ్

- ఇప్పటికే చంద్రబాబుకు ఎన్ఎస్జీ, ఎస్ఎస్జీ, స్థానిక బలగాలతో భద్రత
- విదేశాల్లో శిక్షణ పొందిన కమెండోలతో భద్రత పెంపు
- దాడి చేసిన వారిని తుదముట్టించడమే ఈ కమెండోల లక్ష్యం



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రత మరింత కట్టుదిట్టమయింది. ఆయన భద్రతావలయంలోకి కౌంటర్ యాక్షన్ బృందాలు వచ్చాయి. ఆయన భద్రతలో ఉండే ఎన్ఎస్జీ, ఎస్ఎస్జీ, స్థానిక సాయుధ బలగాలకు అదనంగా ఆరుగురు కమెండోలతో కౌంటర్ యాక్షన్ టీమ్ ను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ కు ఎస్పీజీ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. చంద్రబాబుకు మావోయిస్టుల

వివరాలు 2లో..



## ఉచిత పథకాలకు డబ్బులు ఉంటాయి.. కానీ జడ్జిల జీతాలకు ఉండవా?

- రాష్ట్ర ప్రభుత్వాలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం
- ఢిల్లీ ఎన్నికల్లో గెలుపు కోసం రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న హామీలను ప్రస్తావించిన కోర్టు
- జడ్జిల జీతాలు, రిటైర్‌మెంట్ ప్రయోజనాలపై విచారం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు

పెన్ పవర్ డెస్క్:న్యాయమూర్తుల జీతాలు, పెన్షన్ల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తూ ఉచిత పథకాలకు మాత్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 2లో..

## మోదీ వైజాగ్ పర్యటన నేపథ్యంలో షర్మిల ట్వీట్

- విభజన హామీలపై చేసిన మోసాలపై నిలదీసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్న షర్మిల
- ప్రత్యేక హెూదాను అటకెక్కించారని విమర్శ
- వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని మండిపాటు

పెన్ పవర్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా రూ. 2 లక్షల కోట్లకు పైగా అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు.

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# భయం కాదు జాగ్రత్త అవసరం

అదిగో పులి అంటే ఇదిగో తోక అంటూ సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారహితంగా పోస్టులు పెట్టేవారి పుణ్యమాని హెచ్ఎంపివి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోతోంది. నిజానికి అనేక ఆసియా దేశాలకు ఇది శీతాకాలం. ఇన్‌ఫ్లూయెంజా, మైక్రోప్లాస్మా, నిమోనియా వంటి వ్యాధులు ప్రబలి, జలుబు, దగ్గు, ఇతర శ్వాసకోశ వ్యాధులతో జనం బాధపడటం సహజం. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలూ, పెద్దలూ త్వరితగతిన ఇలాంటి వ్యాధులకు లోనవుతూ ఉంటారు. కోవిడ్ వ్యాప్తి చెందిన తొలినాళ్లలో అవగాహన లేమివల్ల ప్రజలను అప్రమత్తం చేయడంలోనూ, సరైన నిరోధక చర్యలు చేపట్టడంలోనూ జరిగిన జాప్యం లక్షలాదిమంది ప్రాణాలను బలిగొనడానికి కారణమైంది. మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని తెలిస్తే, ఆందోళన చెందడం సహజం. అయితే, గత ఏడాదితో పోలిస్తే తమ దేశంలో హెచ్ఎంపివి కేసులు తగ్గాయంటూ చైనా గణాంకాలతోసహా పేర్కొంటూ ఉండగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఇప్పటి వరకూ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించకపోవడాన్ని బట్టి హెచ్ఎంపివి అంత ప్రమాదకరమైన వైరస్ కాదని తెలుస్తోంది. ఈ సూక్ష్మక్రిముల బారిన పడినవారు కోవిడ్ లాగానే శ్వాసకోశ వ్యాధులకు లోనవుతారని తేలినా, ఇప్పటివరకూ దీనికి వ్యాక్సీన్ కనిపెట్టకపోవడం వైద్య ఆరోగ్య శాఖ ఉదాసీన వైఖరికి ఉదాహరణ.కరోనా మహమ్మారి విలయతాండవం సృష్టించి ఐదేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆ పేరు వింటే చాలు వెన్నులోంచి వణుకు పుడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మహమ్మారి వైరస్ లక్షలాది మందిని కబళించింది. దీని బారినపడి బతికి బట్టకట్టినవారు ఉన్నా, దాని ప్రభావంతో ఇప్పటికీ పడరాని పాట్లు పడుతున్నారన్నది తోసిపుచ్చలేని నిజం. మళ్లీ అలాంటి వైరస్ ఒకటి వెలుగు చూసిందనీ, మానవాళిని తుదముట్టించేందుకు ముంచుకువస్తోందని తెలిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడా పరిస్థితి ప్రజానీకానికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. కరోనా వైరస్‌కు పుట్టినిల్లయిన చైనాలోనే హెచ్ఎంపివి అనే కొత్తరకం వైరస్ పుట్టి, విస్తృతంగా వ్యాప్తి చెందుతోందని, దీని బారినపడిన జనం వేల సంఖ్యలో ఆస్పత్రులలో చేరుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా పోస్టవుతున్న వీడియోలను చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు.తాజాగా బెంగళూరులోను, అహ్మదాబాద్‌లోను వెలుగుచూసిందన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. బెంగళూరులోని ఒక ఆస్పత్రిలో ఎనిమిది నెలలు, మూడు నెలలు వయసున్న ఇద్దరు పసికందులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, హెచ్ఎంపివి జాడలు బయటపడ్డాయని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. ఇండియాలోనే కాకుండా, అనేక దేశాల్లో జనావళి ఈ వైరస్ గురించి చర్చించుకోవడం, ఆందోళన చెందడం కొన్ని రోజులుగా జరుగుతోంది. ఇటీవల చైనాలోనూ, తాజాగా బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లోనూ వెలుగు చూసిందని చెబుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ఎంపివి) కోవిడ్ లా ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినదేమీ కాదు. దీని జాడలు 2001లోనే నెదర్లాండ్స్‌లో బయటపడ్డాయి. 2018లో ప్రపంచవ్యాప్తంగా ఆస్పత్రిపాలైన చిన్నారుల్లో మూడు నుంచి పది శాతం మంది హెచ్ఎంపివి బారిన పడినట్లు ఒక అధ్యయనంలో తేలింది. దీనిని బట్టి ఈ వైరస్ ప్రపంచానికి పాతదేనని స్పష్టమవుతోంది.చైనాలో హెచ్ఎంపివి కేసులు పెరుగుతున్నట్లుగా వస్తున్న వార్తలపై తక్షణమే స్పందించి, ప్రపంచ ఆరోగ్య సంస్థను వివరాలకోసం అడగడం భారత ప్రభుత్వం అప్రమత్తతను తెలియజేస్తోంది. దీనికి తోడు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ రంగంలోకి దిగి, జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించి, హెచ్ఎంపివి వ్యాప్తి, నివారణపై తీసుకోవలసిన చర్యల గురించి చర్చించింది. దేశవ్యాప్తంగా ఆరోగ్యశాఖాధికారులు పలు ప్రాంతాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బెంగళూరులో హెచ్ఎంపివి వైరస్ సోకిన ఇద్దరు పసికందుల్లో ఒకరు ఇప్పటికే ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ కాగా, మరొకరిలో వ్యాధి తగ్గుముఖం పట్టిందన్న విషయం గమనార్హం. పైగా ఈ ఇద్దరికీ విదేశాల నుంచి వచ్చినవారివల్ల ఈ వైరస్ సోకలేదన్న ఆరోగ్య శాఖ ప్రకటనను బట్టి, కోవిడ్ మాదిరిగా హెచ్ఎంపివి ఇప్పటికిప్పుడు చైనా నుంచి దిగుమతైన వైరస్ కాదన్న సంగతి స్పష్టమవుతోంది.వ్యాధులవ్యాప్తి అంతగా లేనప్పటికీ గత కోవిడ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎంపివి వ్యాప్తిని అరికట్టేందుకు చైనా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని అక్కడి అధికార మీడియా వెల్లడించడం ఊరట కలిగించే విషయం. ఏదిఏమైనా, హెచ్ఎంపివి వైరస్ జాడలు మన దేశంలోనూ బయటపడిన నేపథ్యంలో మరింత వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అవసరం. వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి, హెచ్ఎంపివి జాడ కనిపెట్టి, ఈ మహమ్మారిని మొగ్గలోనే తుంచేందుకు ప్రభుత్వాలు నడుం బిగించాలి. ప్రజలు తమ వంతు బాధ్యతగా స్వీయ రక్షణ చర్యలు చేపట్టడం అత్యంత ఆవశ్యకం.

# ఏపీ ఇక అభివృద్ధిలో దూసుకుపోతుంది

విశాఖ సభలో ప్రధాని నరేంద్ర మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. ఇక్కడి సింహాచల వరాహ నరసింహస్వామికి ప్రణామాలు ఆచరిస్తున్నానని తెలిపారు. ఏపీ ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్టు వెల్లడించారు. తాను మూడోసారి ప్రధానిగా ఎన్నికవడంలో ఏపీ ప్రజలు చూపించి ప్రేమాభిమానాలు మరువలేనని అన్నారు.

చంద్రబాబు ప్రసంగంలోని ప్రతి మాట వెనుక ఉన్న భావం అర్థమైందని... ఏపీకి సంబంధించి ప్రజలు, ముఖ్యమంత్రి ఏ విధంగా అయితే విశ్వాసం చూపిస్తున్నారో, ఆ విశ్వాసానికి ఎక్కడా భంగం కలగకుండా మీ లక్ష్యాలన్నింటినీ సాకారం చేసేందుకు కృషి చేస్తానని మోదీ స్పష్టం చేశారు. "ఇవాళ ఆంధ్ర ప్రజల స్వాగతం, ఆశీర్వాదాలు చూశాను. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తాను. ఏపీ అభివృద్ధితో దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. 2047 నాటికి ఏపీ 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి తోడ్పాటు అందిస్తాం. చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం భుజం భుజం కలిపి నడుస్తుంది. అందుకే లక్షల కోట్ల విలువైన పథకాలతో ఏపీపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

నేడు రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేర్చుతాయి. ఏపీ ప్రజల సృజనాత్మకత వల్ల రాష్ట్రం ఐటీ, టెక్నాలజీకి ఒక పెద్ద కేంద్రంగా మారింది. ఏపీకి ఇప్పుడు సమయం వచ్చింది. సరికొత్త టెక్నాలజీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేంద్రబిందువుగా మారాలి. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ఏపీ సారథ్యం వహించాలి. ఏపీలో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ హైడ్రోజన్ కూడా అలాంటి అభివృద్ధి చెందే ప్రాజెక్టే. దేశంలో 2023లో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టును ప్రారంభించాం. 2030 నాటికి ఐదు మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ను మనదేశంలో ఉత్పత్తి చేయాలి అనేది మా లక్ష్యం. అందుకోసం ప్రారంభ దశలోనే రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్ లను తీసుకువస్తున్నాం. అందులో ఒకటి మన విశాఖ ప్రాంతంలో వస్తోంది. భవిష్యత్తులో విశాఖ నగరం ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసే నగరంగా నిలుస్తుంది. ఈ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా అనేక ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఏపీలో మాన్యుఫ్యాక్చరింగ్ వ్యవస్థ కూడా అభివృద్ధి జరుగుతుంది. ఇక, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేసే అదృష్టం నాకు దక్కింది. ఏపీలో పట్టణీకరణ కొత్త పుంతలు తొక్కనుంది. కృష్ణపట్నంలో క్రిస్ సిటీ ప్రాజెక్టు వల్ల లక్ష మందికి ఉద్యోగ ఉపాధి కలుగుతుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు పునాదిరాయి వేశాం. ఏపీ అభివృద్ధిలో ఈ రైల్వే జోన్ కూడా కీలకం కానుంది. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ఆంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. విశాఖ తీరం వందల ఏళ్లుగా ఎగుమతులు, దిగుమతుల్లో ప్రధాన పాత్ర పోషిస్తోంది. సాగర సంబంధింత అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా అభివృద్ధికి బాటలు వేసుకోవచ్చు. వికసిత్ ఆంధ్రకు కేంద్రం సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రధాని మోదీ విశాఖ సభ ద్వారా భరోసా ఇచ్చారు.

# రాసి పెట్టుకోండి... ఢిల్లీ ఎన్నికల్లో గెలిచేది ఎన్డీయే

విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న రోడ్ షో అదిరిపోయిందని, బ్రహ్మాండంగా జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ రోజు మన రాష్ట్రానికి చరిత్రలో మిగిలిపోయే రోజు అని అభివర్ణించారు. ప్రధాని చేతుల మీదుగా రూ.2,08,548 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఇవాళ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశాం అని వెల్లడించారు. ఇలాంటి శుభదినం నా జీవితంలో, ఆంధ్రరాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా జరిగిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో అండగా ఉన్న ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు. "చిరకాల వాంఛ అయిన విశాఖ రైల్వే జోన్ కు గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధానమంత్రి ఆశీస్సులతో విశాఖ రైల్వే జోన్ పనులు ప్రారంభం అయ్యాయి. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ కోసం రూ.1877 కోట్ల పెట్టుబడి పెడుతున్నాం. కృష్ణపట్నం వద్ద క్రిష్ సిటీ కోసం రూ.2,300 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాం.

రూ.6,177 కోట్లతో ఏడు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశాం. మూడు రైల్వే ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాం. ఏడు జాతీయ రహదారులకు ప్రారంభోత్సవం చేస్తున్నాం. మా ప్రభుత్వం వచ్చి ఏడు నెలలే అయింది. ఎన్నికలయ్యాక మోదీ మొదటిసారిగా రాష్ట్రానికి వచ్చారు. రావడంతోనే రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారంటే... ఆంధ్ర రాష్ట్రమంతా వినిపించేలా గట్టిగా చప్పట్లు కొట్టి ఆయనను అభినందించాలి.

అనునిత్యం అండగా నిలుస్తూ, అసాధ్యాని సుసాధ్యం చేస్తున్న వ్యక్తి నరేంద్ర మోదీ. మోదీ అభిమానం ఉత్తరాదికే పరిమితం అని కొందరు మాట్లాడుతున్నారు... కానీ దేశం, ప్రపంచం మొత్తం మెచ్చే నాయకుడు ప్రధాని మోదీ. మొన్నటి ఎన్నికల్లో మోదీ, మిత్రుడు పవన్ కల్యాణ్, నేను కలిశాం. నేను నాలుగున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నాను. కానీ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ కూడా ఇంత భారీ స్థాయిలో గెలవలేదు. 93 శాతం స్ట్రయిక్ రేట్, 57 శాతం ఓట్లేశారు, 175కి 164 సీట్లు గెలిచాం. 25కి 21 పార్లమెంటు సీట్లు గెలిచాం. భవిష్యత్తులో ఎప్పుడూ కూడా ఏపీలో ఈ కాంబినేషన్ ఉంటుంది... దేశ రాజకీయాల్లో మోదీనే ప్రధానిగా ఉంటారు.

ఇటీవల హర్యానాలో, మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయి... ఈ రెండు చోట్ల ఎన్డీయే కూటమి తిరుగులేని విజయం సాధించింది. రేపు ఢిల్లీ ఎన్నికలు వస్తున్నాయి.... రాసిపెట్టుకోండి.... ఢిల్లీలో గెలవబోయేది ఎన్డీయే. దానికి కారణం నరేంద్ర మోదీ. దేశం కోసం పనిచేస్తే ప్రజలందరూ వెంట నిలుస్తారు. ఇందుకు ఇవాల్టి సభలో మోదీ మోదీ నినాదాలే అందుకు నిదర్శనం. సంస్కరణలు, సుపరిపాలనతో దేశాన్ని మోదీ ముందుకు తీసుకువెళుతున్నారు. పీఎం కిసాన్ కింద రైతులకు ఏడాది రూ.6 వేలు ఇస్తున్నారు. కొవిడ్ సమయంలో ప్రారంభించిన రూ.5 కేజీల బియ్యం పథకాన్ని ఇవాళ కూడా కొనసాగిస్తున్నారు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చడానికి మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, గతి శక్తి వంటి విప్లవాత్మక కార్యక్రమాలతో దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. ఇళ్లు లేని కోట్లాది పేదలకు ఇళ్లు కట్టించారు.

జనవరి 1న ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి నేను రైతులతోనే ఉంటాను అని చెప్పిన వ్యక్తి నరేంద్ర మోదీ. నాలుగు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా పీఎం ఫసల్ బీమా పథకం అమలు చేస్తున్నారు. రూ.3,850 కోట్లతో ఎరువుల సబ్సిడీ కొనసాగించాలని క్యాబినెట్ లో నిర్ణయించారు. పేదల కోసం పీఎం సూర్యఘర్, కుసుమ్ వంటి పథకాలు తీసుకువచ్చారు. ఎవరి ఇంటిపై వారే సౌర శక్తిని ఉపయోగించుకుని కరెంటు తయారుచేసుకునే పథకాలు ఇవి. భవిష్యత్తులో కరెంటు చార్జీల భారం లేకుండా పేదలకు అండగా నిలిచే పథకాలు తీసుకువచ్చారు. ఇవన్నీ ఏడు నెలల్లో చేయగలిగారు. వారి విధానం... సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్... ఇదే నినాదంతో ముందుకు వెళుతున్నారు. 2014లో భారత ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉంటే, ఇప్పుడు ఐదో స్థానంలో ఉంది. 2029కి మూడో స్థానంలోకి వచ్చే భారతదేశం... 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థికవ్యవస్థగా ఎదుగుతుంది. ఇది వేరేవాళ్లకు సాధ్యం కాదు... ఒక్క నరేంద్ర మోదీకే సాధ్యం. మన రాష్ట్రానికి వస్తే... విభజన జరిగినప్పుడు న్యాయం జరగలేదని చెప్పి, న్యాయం చేయాలని చర్యలు తీసుకున్న వ్యక్తి మోదీ. పోలవరం పూర్తి కావాలంటే తెలంగాణలోని ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్ కు ఇవ్వాలని చెప్పి, ఆ ఏడు మండలాలు ఇచ్చిన తర్వాతే పార్లమెంటు సమావేశాలు పెట్టిన వ్యక్తి మోదీ.

2014-19లో ఐఐటీ, ఐఐఎం, నిట్, ఎయిమ్స్, ట్రైబల్ వర్సిటీ, సెంట్రల్ వర్సిటీ... ఇవన్నీ నరేంద్ర మోదీ నాయకత్వంలోనే వచ్చాయి. ఏపీలో అనేక పథకాలు తీసుకువచ్చాం. త్వరలోనే మెగా డీఎస్సీ ఇంటర్వ్యూలకు పిలుస్తాం. ఇవన్నీ కాకుండా సూపర్ సిక్స్ హామీలన్నీ పూర్తి చేసే బాధ్యత ఎన్డీయే సర్కారు తీసుకుంటుంది. సమస్యలు ఉన్నాయి, కష్టాలు ఉన్నాయి... అన్నింటినీ అధిగమిస్తాం. అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కూడా సుపరిపాలనతో ముందుకు తీసుకెళతాం. రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయి. అటు కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ మన బ్రాండ్ ఇమేజి పెంచుకుంటున్నాం. దేశానికి ముంబయి ఎలా ఆర్థిక రాజధానిగా ఉందో, విశాఖ మన రాష్ట్రానికి ఆర్థిక రాజధాని. ఇవాళ అరకు కాఫీ వరల్డ్ ఫేమస్ అయిందంటే మన ప్రధాని చూపించిన చొరవే కారణం. మోదీ సర్... మీరే నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తి. నాడు అమరావతికి మీరు శంకుస్థాపన చేశారు. ఆనాడు ఎక్కడ అమరావతి ఆగిపోయిందే అక్కడ్నుంచే ముందుకు తీసుకెళుతున్నాం. కలను నిజం చేస్తాం" అని చంద్రబాబు వివరించారు.

## ఈ నెలాఖరు నుంచి ప్రజల్లోనే...

# జగన్ కీలక నిర్ణయం

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ ఇవాళ తాడేపల్లిలో నెల్లూరు జిల్లా వైసీపీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని, చంద్రబాబు దుర్మార్గపు పరిపాలన వల్ల మనం ప్రజలకు తోడుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

మన పాలనలో అన్నీ ఇంటివద్దనే డోర్ డెలివరీ చేశాం... కానీ ఇప్పుడు ప్రజలు టీడీపీ నాయకుల వద్దకు తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని జగన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి సమయంలో మనమంతా ప్రజలకు అండగా నిలవాలని నేతలకు కర్తవ్యబోధ చేశారు.

తాను కూడా ప్రజల్లోకి వస్తానని జగన్ వెల్లడించారు. జనవరి నెలాఖరు నుంచి లేదా ఫిబ్రవరి నుంచి జిల్లాల పర్యటనకు వస్తానని ప్రకటించారు. ప్రతి వారంలో 3 రోజులు ఒక పార్లమెంటు స్థానంలో మకాం వేస్తానని, ప్రతి రోజు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలతో సమావేశమవుతానని వెల్లడించారు. బూత్ స్థాయి నుంచి ప్రతి కమిటీ బలోపేతం కావాలని, సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇవాళ మనం కేవలం చంద్రబాబుతోనే యుద్ధం చేయడంలేదు, కుళ్లిపోయిన మీడియాతోనూ యుద్ధం చేస్తున్నాం అని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీలో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ప్రాధాన్యత గుర్తించాలని జగన్ స్పష్టం చేశారు.

# ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవు... ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం

**పెన్ పవర్ డెస్క్:** ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఏపీ ప్రభుత్వం సంస్కరణలను తీసుకొచ్చింది. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవని వెల్లడించింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. జాతీయ కరికులం చట్టాన్ని అనుసరించి సంస్కరణలు చేపట్టినట్టు వెల్లడించారు. సైన్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో సంస్కరణలు అమలు చేస్తామని కృతికా శుక్లా తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో ఎన్సీఈఆర్టీ పుస్తకాలను పెడుతున్నామని... దీనివల్ల నీట్, జేఈఈ వంటి జాతీయ పోటీ పరీక్షలకు సులభతరం అవుతుందని చెప్పారు. సీబీఎస్ఈ విధానంతో ముందుకు సాగుతామని అన్నారు.సంస్కరణల్లో భాగంగానే ఇంటర్ ఫస్టియర్ పబ్లిక్ పరీక్షలను తొలగించామని తెలిపారు. తొలి సంవత్సరం పరీక్షలను ఆయా కాలేజీలే అంతర్గతంగా నిర్వహిస్తాయని... ఇంటర్ సెకండియర్ పరీక్షలను మాత్రం ఇంటర్ బోర్డు నిర్వహిస్తుందని చెప్పారు. సంస్కరణలపై ఈ నెల 26 లోగా సలహాలు, సూచనలు పంపవచ్చని తెలిపారు.

# మోదీ నిర్దేశకత్వం, చంద్రబాబు నాయకత్వం... ఇదే మా పంథా

మొదటి పేజీ తరువాయి

వారందరినీ ఏకతాటిపై నడిపిస్తే అది ఆత్మనిర్భర్ భారత్ అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇవాళ విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన ప్రజావేదిక సభకు పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. "కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలకు వారి పరిసరాల శుభ్రత భాధ్యతను తెలియజేస్తే అది స్వచ్ఛ భారత్ అవుతుంది. అదే కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రజల్లో ధైర్యసాహసాలు నింపితే అది ఒక బలిష్టమైన, పటిష్టమైన భారత్ అవుతుంది. అది ఒక రోజున అఖండ భారత్ అయి తీరుతుంది. భారత్ ను ప్రపంచ దేశాల్లో మూడో బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా నడిపిస్తున్న మన ప్రియతమ ప్రధానికి నా తరఫున, ఐదు కోట్ల మంది ఆంధ్రుల తరఫున హృదయపూర్వక నమస్కారాలు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించి, రెవెన్యూ మంత్రిగా, ఆర్థికమంత్రిగా అంచెలంచెలుగా ఎదిగి, టీడీపీ రథ సారథి అయి, నాలుగోసారి ముఖ్యమంత్రి అయి, తెలుగు ప్రజలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రాజకీయ ఉద్ధండులు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు నా హృదయపూర్వక నమస్కారాలు. నా సహచర మంత్రి నారా లోకేశ్ కు, ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, బీజేపీ నేతలకు పేరుపేరునా నమస్కారాలు. మాకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు పేరుపేరునా నమస్కారాలు. ప్రధాని మోదీ 7 లక్షల మందికి ఉపాధి కల్పించే రూ.2.10 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. అవినీతితో కూరుకుపోయి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక విలవిల్లాడుతున్న తరుణంలో మీరు మా కోసం నిలబడ్డారు. లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులతో మాకు అండగా నిలుస్తున్నందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు. 24 గంటలు తాగునీరు, మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు వేయగలుగుతున్నామంటే అందుకు కారణం మోదీ గారు వెన్నుతట్టి మద్దతుగా నిలుస్తున్నారు. గత ఐదేళ్ల అవినీతి, అరాచక పాలనతో ఏపీ అంధకారంలో మునిగిపోయినప్పుడు... ఆంధ్రాకు ఇక ఎలాంటి అవకాశమే లేదు అనుకున్న సమయంలో... ఇటువంటి స్థితి నుంచి అభివృద్ధి అంటే ఆంధ్రానే అనుకునేలా చంద్రబాబు నాయకత్వంతో ప్రధాని మోదీ నిర్దేశకత్వంలో వారి సూచనలు, సలహాలతో మా మంత్రి వర్గం, కార్యకర్తలు అభివృద్ధిలో భాగమవుతాం. ప్రజలు మాపై నమ్మకం పెట్టారు....ఆ నమ్మకం ఫలితమే ఇవాళ రూ.2 లక్షల కోట్లకు పైగా పనులు రాష్ట్రానికి వచ్చాయి. ఈ దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేలా ప్రధాని మోదీకి ఆ లక్ష్మీనరసింహస్వామి దీర్ఘాయుష్షును ఇవ్వాలని కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# మోదీ వైజాగ్ పర్యటన నేపథ్యంలో షర్మిల ట్వీట్

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల స్పందిస్తూ ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'చంద్రబాబు గారు... మీరు మోదీ కోసం ఎదురు చూస్తుంటే... ఆయన ఇచ్చిన వాగ్దానాల కోసం రాష్ట్రం ఎదురు చూస్తోంది. విభజన హామీలపై చేసిన మోసాలపై నిలదీసేందుకు ప్రజానీకం ఎదురు చూస్తోంది. తిరుపతి వేదికగా మీ సమక్షంలోనే రాష్ట్రానికి 10 ఏళ్లు ప్రత్యేక హోదా అన్నారు. 10 ఏళ్లు కాదు 15 ఏళ్లు కావాలని మీరు అడిగారు. మాటలు కోటలు దాటాయి తప్పిస్తే... చేతలకు దిక్కులేదు. రాష్ట్రానికి సంజీవని లాంటి హోదా హామీని అందరు కలిసి ఆటకెక్కించారు' అని షర్మిల విమర్శించారు.వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన పాపాన పోలేదని షర్మిల దుయ్యబట్టారు. ఢిల్లీని తలదన్నే రాజధాని కట్టలేదని, పారిశ్రామిక కారిడార్ల స్థాపన జరగలేదని, 10 ఏళ్లు దాటినా పోలవరం నుంచి చుక్క నీరు పారలేదని, కడప స్టీల్ కట్టలేదని, విశాఖ ఉక్కును రక్షించలేదని విమర్శించారు.

ఏటా 2 కోట్ల ఉద్యోగాల్లో కనీసం లక్ష ఉద్యోగాలు కూడా రాష్ట్రానికి ఇచ్చింది లేదని మోదీపై విమర్శలు గుప్పించారు. విశాఖకు వస్తున్న ప్రధాని మోదీతో ప్రత్యేక హోదా ప్రకటన చేయించాలని, విభజన హామీలపై క్లారిటీ ఇప్పించాలని, విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ లేదని ప్రకటన చేయించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ను కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం...

- మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. అన్ని రకాల రోడ్లపై మోటారు వాహనాల కారణంగా జరిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుందని గడ్కరీ వివరించారు.రోడ్డు ప్రమాదం తర్వాత బాధితులకు అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్' సమయంలో వైద్య సహాయాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) ఈ స్కీమ్‌ను అమలు చేస్తుందని తెలిపారు. పోలీసులు, హాస్పిటల్స్, ప్రభుత్వ వైద్య సంస్థల సహకారం తీసుకోనున్నట్టు గడ్కరీ వెల్లడించారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఈ-డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈఏడీఆర్) అప్లికేషన్, ఎన్‌హెచ్ఏ ట్రాన్సాక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఈ మూడింటితో అనుసంధానించిన ఐటీ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ పథకం కార్యకలాపాలు నిర్వహించనున్నట్టు వివరించారు.ఈ పథకం పైలట్ ప్రాజెక్టు 2024 మార్చి 14న చండీగఢ్‌లో ప్రారంభమైందని, ఆ తర్వాత ఆరు ఇతర రాష్ట్రాలకు విస్తరించామని గడ్కరీ వెల్లడించారు. దేశంలో ఏకంగా 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# చంద్రబాబు భద్రత మరింత కట్టుదిట్టం.. అదనంగా కమెండోలతో కౌంటర్ యాక్షన్ టీమ్

- మొదటి పేజీ తరువాయి

నుంచి ముప్పు ఉన్న నేపథ్యంలో ఆయన భద్రతను కట్టుదిట్టం చేశారు. మన దేశంలో బ్లాక్ క్యాట్ కమెండోలు, ఎన్ఎస్జీ సెక్యూరిటీ కలిగిన అతికొద్ది మంది వ్యక్తుల్లో చంద్రబాబు ఒకరు.

చంద్రబాబు భద్రతలో మూడు వలయాలు ఉంటాయి. తొలి వలయంలో ఎన్ఎస్జీ, రెండో వలయంలో ఎస్ఎస్జీ, మూడో వలయంలో దూరంగా ఆరుగురు కౌంటర్ యాక్షన్ కమెండోలు ఉంటారు. ఏదైనా జరిగితే ఎన్ఎస్జీ, ఎస్ఎస్జీ బృందాలు చంద్రబాబును వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. కౌంటర్ యాక్షన్ టీమ్ మాత్రం దాడికి వచ్చిన వారిని వదలకుండా, వారిని తుదముట్టిస్తుంది. ఈ మేరకు వారికి శిక్షణ ఇచ్చారు. విదేశాలతో పాటు, దేశంలో వివిధ అత్యుత్తమ శిక్షణ ఇచ్చే కేంద్రాలలో వీరికి శిక్షణ ఇప్పించారు. నిన్నటి నుంచి వీరు అధికారికంగా చంద్రబాబు భద్రతావలయంలో చేరారు.

# ఉచిత పథకాలకు డబ్బులు ఉంటాయి.. కానీ జడ్జిల జీతాలకు ఉండవా?

- మొదటి పేజీ తరువాయి

"ఉచితాలకు డబ్బులు ఉంటాయి కానీ జడ్జిల జీతాల చెల్లింపునకు మాత్రం ఉండవా?" అని నిలదీసింది. దేశంలోని న్యాయమూర్తులకు చాలీచాలని జీతాలు, పదవీ విరమణ అనంతరం అందుతున్న అరకొర ప్రయోజనాలపై విచారం వ్యక్తం చేస్తూ అఖిల భారత న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జడ్జిలు బీఆర్ గవాయ్, ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.ఇటీవలి జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ప్రకటించిన 'లడ్కీ బెహన్' పథకం, ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ ప్రకటించిన 'మహిళా సమ్మాన్ యోజన', కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆర్థిక హామీలను ఈ సందర్భంగా ధర్మాసనం ప్రస్తావించింది. "జడ్జిలకు జీతాలు చెల్లించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తరచుగా ఆర్థిక పరిమితులను సూచిస్తుంటాయి. అయితే, ఎన్నికల సమయంలో మాత్రం 'లడ్కీ బెహన్' వంటి ఉచితాలు ప్రకటిస్తుంటారు. ఢిల్లీ ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ పార్టీలు మహిళలకు రూ.2,100 లేదా రూ.2,500 చెల్లిస్తామంటూ ఆర్థిక వాగ్దానాలు చేయడం మనం చూశాం" అని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

# రఘురామ చిత్రహింసల కేసు: విజయపాల్ ను ఒంగోలుకు తరలింపు

- మొదటి పేజీ తరువాయి

వరకు విజయ్ పాల్ కు న్యాయస్థానం కస్టడీ విధించింది.

ఈ నేపథ్యంలో, రిమాండ్ ఖైదీగా ఉన్న విజయ్ పాల్ ను పోలీసులు గుంటూరు నుంచి ఒంగోలుకు తరలించారు. ఈ ఉదయం ఆయనను గుంటూరు జైలు నుంచి తీసుకువచ్చిన ప్రకాశం పోలీసులు... గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఒంగోలు తీసుకెళ్లారు. ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు విజయ్ పాల్ ను 24 గంటల పాటు విచారించనున్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు అరెస్ట్



**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, జనవరి 08.** :ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్బంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ ఆపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రి యాంక దండి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నా యకులతో మద్దిలపాలెం జంక్షన్ ఆంధ్ర యూని వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగారు, ఈ సందర్బంగా పోలీస్ వారు అరెస్ట్ చేసి ఎం వి పి పోలీస్ స్టేషన్ కి తరలించారు, అరెస్ట్ అయిన వారిలో జాతీయ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ మరి యు ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ మమ తా నాగిరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కాండవ గాయత్రి,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్య క్షులు లక్కరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి పినమాల శివ కుమార్ , విశాఖ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లిపిల్లి సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో సువర్ణాధ్యాయం






- రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తున్న ప్రధాని మోదీ జీ
- శక్తివంతమైన భారత్ నిర్మాణంలో భాగస్వాము లవుతాం
- మోడీ పీపుల్స్ మ్యాన్.పేదవాడి కళ్లలో వెలుగుకు రూపం
- విశాఖపట్నం సభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జనవరి 08 :** గత ప్రభుత్వ అసమర్థత వలన వెంటిలేటర్ పైకి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ కు ప్రధాని నరేంద్ర మోడీ ఆక్సిజన్ అందిస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అ న్నారు. విశాఖపట్నం ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ వేదికపై నుంచి రాష్ట్రంలో రూ. 2లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్ గా ప్రధాని మోడీ శంకుస్థాపన, ప్రారం భోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రతి నెలా రూ. 4 వేల కోట్ల లోటు బడ్జెట్ తో ఏపీ ప్రభుత్వం నడుస్తోంది. వెంటిలే టర్ పై ఉన్న రాష్ట్రానికి గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆక్సిజన్ అందిస్తున్నారు. అమ రావతికి రూ. 15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు కు రూ. 12157 కోట్ల కేంద్రం నుంచి సాయం అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరు వాతనే భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు వేగ వంతం అయ్యాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకోవడానికి మన విజనరీ లీడర్ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారు. వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి 5 ఏళ్లు తీసుకున్న గత ప్రభుత్వాన్ని చూసాం. కానీ చంద్రబాబు గారు ఒకే ఒక్క సంతకంతో వెయ్యి రూపాయల పెన్షన్ పెంచా రు. మూసేసిన అన్న క్యాంటీన్లు తెరిచాం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారు, త్వరలోనే మెగా డీఎస్సీ, త్వరలోనే జాబ్ క్యాలెండర్ ఇవ్వబోతున్నారు,దటీజ్ సి.బి. ఎన్.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో సువర్ణా ధ్యాయం. వికసిత్ భారత్ స్ఫూర్తితోనే స్వర్ణాం ధ్ర 2047,బ్యూటీఫుల్ సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖప ట్నం తరపున గౌరవ ప్రధాని నరేంద్ర మోడీజీకి స్వాగతం. ప్రతి భారతీయుడి గుండెల్లో నరేంద్ర మోదీ. మోడీజీ కారణంగా ప్రపంచ మంతా భారత్ వైపు చూస్తోంది. నరేంద్రమోడీ పి.ఎం అనే పదానికి అర్థాన్ని మార్చేశారు, మామూలు గా పిఎం అంటే ప్రైమ్ మినిస్టర్, నరేంద్ర మోడీజీ పీపుల్స్ మ్యాన్.నరేంద్ర మోదీ జీ విజన్ గ్లోబల్. అయినా అతని హృదయం మాత్రం పేద ప్రజల తోనే ఉంటుంది. నమో అంటే పేదవాడి నమ్మ కం, పేదవాడి భరోసా, దేశానికి ధైర్యం. పేదల చిరునవ్వు, మహిళల ఆత్మగౌరవం, యువత భవిత, అన్నదాత కళ్ళలో ఆనందానికి ప్రతిరూ పం మోడీజీ. వికసిత్ భారత్ 2047 విజన్ డా క్యుమెంట్ రిలీజ్ చేసి 2047 కి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తయారు చెయ్యాల నే లక్ష్యంతో మోడీజీ పనిచేస్తున్నారు. 2014 నాటికి ప్రపంచంలో 11 వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ నేడు 5 స్థానానికి వచ్చింది. వికసి త్ భారత్ -2047 లక్ష్యంతో టాప్ 1 లేదా 2 ఆ ర్థిక వ్యవస్థగా దేశాన్ని మార్చేందుకు మోదీ కృషి చేస్తున్నారు. నరేంద్ర మోదీ వికసిత్ భారత్ స్ఫూ ర్తి తో మన సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ రిలీజ్ చేసారు. దిమాక్ ఉన్నవాడు దునియా మొత్తం చూస్తాడు. చంద్ర బాబు గారు విజన్ 2020 అంటే ఎంతో మంది నవ్వారు, వెటకారం గా మాట్లాడారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ వెళ్లి చూస్తే ఆయన విజన్ 2020 లో చెప్పిన ప్రతి మాట నిజం అయ్యింది. వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, రెన్యు వబుల్ ఎనర్జీ, పోర్ట్స్, ఎయిర్పోర్ట్స్, స్పోర్ట్స్ ఇలా అన్ని రంగాల్లో నిర్ణీత లక్ష్యాలతో ముందు కు వెళ్లడమే స్వర్ణాంధ్ర 2047 ముఖ్యోద్దేశం.

స్థిరమైన ప్రభుత్వాలు కొనసాగితేనే అభివృద్ధి

చరిత్ర లో నిలిచిపోతుంది. రాష్ట్ర దశదిశ మార్చే ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకు స్థాపన చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక విశాఖ రైల్వే జోన్. గత ప్రభుత్వం కనీసం భూ మి కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి న తరువత విశాఖ రైల్వే జోన్ ట్రాక్ ఎక్కింది. నేడుమోదీజీ దానికి శంకుస్థాపన చేశారు. రూ. 1.85లక్షల కోట్లతో పూడిమడకలో ఎన్టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్, రూ. 1877 కోట్లతో నక్కప ల్లి లో బల్క్ డ్రగ్ పార్క్. రూ. 10,500 కోట్లతో కృష్ణపట్నం లో పరిశ్రమల ఏర్పాటు, రూ. 8016 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు,ఇంకా అనేక కార్యక్రమాలకు మోదీజీ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రజల తరపున నరేంద్ర మోదీజీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. స్థిరమైన ప్రభుత్వ కొనసాగింపు అభివృద్ధికి చాలా ముఖ్యం. నరేంద్ర మోదీ మూడో సారి ప్రధాని అయ్యారు. మూడో సారి దేశంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్ప డింది. అందుకే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఆలో చించాలి. 2014 - 19 వరకూ ఎన్డీయే ప్రభుత్వం లో రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందిందో మీకు తె లుసు. ఆ తరువాత 2019-24 నడుమ జరిగిన విధ్వంసం మీరు కళ్లారా చూసారు. అదే ఎన్ డిఎ ప్రభుత్వం కొనసాగించి ఉంటే రాష్ట్రం ఈ పరిస్థితుల్లో ఉండేది కాదు. ఆంధ్రప్రదేశ్ పై మోదీ జీ చూపుతున్న ప్రేమ, అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్ లోని డబుల్ ఇంజన్ సర్కారు వేగవంతమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తూ, శక్తివంతమైన భారతదేశ నిర్మాణంలో భాగస్వా మ్యం వహించబోతోంది. ఆంధ్రప్రదేశ్ కు మీరు పెద్దన్నలా సహకారం అందించండి. వికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనలో మేం భాగస్వా ములం అవుతాం. రాష్ట్రాలు బలోపేతమైతేనే జాతి బలంగా తయారవుతుందని నేను నమ్ము తాను. ప్రస్తుతం భారత్ లో నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్ ఎక్కడ చూసినా నమో మేనియా మారు మోగుతోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.



## ఐఎన్ఎస్ డేగలో ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం

### రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆత్మీయ స్వాగతం పలికారు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జనవరి 08:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఐఎన్ఎస్ డేగలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు ఆత్మీయ స్వాగతం పలికారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగాకు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. ఈ క్రమంలో ప్రధానికి రాష్ట్రానికి చెందిన రాజకీయ, అధికార ప్రముఖులు స్వాగతం పలికారు.

రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో పాటు పార్లమెంటు సభ్యులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి. పురంధేశ్వరి, ఈస్టర్న్ నేవల్ కమాండర్ వైస్ అడ్మిరల్ పెందార్కర్, రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఆర్. కృష్ణయ్య, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుదు (గణబాబు), శాసన సభ్యులు సిహెచ్ ఆదినారాయణ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, అతిది గజపతి రాజు, కోండ్రు మురళీ మోహన్, కొణతాల రామకృష్ణ, కామినేని శ్రీనివాసరావు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, శాసన మండలి సభ్యులు, విప్ వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



## జిల్లా అభివృద్ధికి సమన్వయంతో సమష్టి కృషి చేయాలి

**కురుపాం / పార్వతీపురం పెన్ పవర్, , జనవరి 8,:**జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేవిధంగా అధికారులు సమన్వయంతో సమష్టి కృషి చేయాలని అరకు పార్లమెంట్ సభ్యురాలు తనూజా రాణి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, వివిధ శాఖల ప్రగతిపై అధికారులతో జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిషా కమిటీ)సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అభివృద్ధి పనులను సమన్వయంతో సమష్టిగా పనిచేసి లక్ష్యాలను సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య అందేవిధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భిణీ మహిళలు, చిన్నారులలో ఎనీమియా లోపాన్ని అధిగమించేందుకు గ్రామాల్లో ఏ ఎన్ ఎమ్, ఆశ వర్కర్లను పంపించి రక్తహీనతతో బాధపడుతున్న వారిని దత్తత తీసుకొని పర్యవేక్షిస్తున్నామని, ప్రతి 15 రోజులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా,ఎస్. భాస్కర రావు వివరించారు. మెరుగైన చర్యలు చేపట్టడం వలన రక్త హీనత బాధితుల సంఖ్య తగ్గుముఖం పడుతుందని, భవిష్యత్తులో సికిల్ సెల్ కేసులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. (ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్) కుసుం పథకంలో భాగంగా సౌర విద్యుత్, వ్యవసాయం యొక్క ప్రయోజనాలు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే పి ఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన క్రింద రూఫ్ సోలార్ విద్యుత్ ప్రజలకు మరింత చేరేలా కృషిచేయాలని, తద్వారా ప్రజలకు విద్యుత్ భారం తగ్గుతుందని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎంపీ ల్యాండ్ నిధులతో రోడ్లు డ్రైనేజీ కమ్యూనిటీ భవనాల నిర్మాణాల పనుల వివరాలపై ఆరా తీశారు. అవసరమైన చోట అంగన్వాడీ కేంద్రం నిర్వహణ భవన నిర్మాణాలకు, పాఠశాలలో మరుగుదొడ్ల మారామత్తులు ఆధునీకరణ పనులకు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు అందించాలని ఇంజరేరింగ్ అధికారులను కోరారు. జిల్లాలో ప్రధానమంత్రి అర్బన్ ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల వారిగా పురోగతిని, అభివృద్ధి పనుల ప్రగతిని ఎంపీ కి తెలియజేయడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రహదారుల అభివృద్ధిలో భాగంగా మూడు రాష్ట్ర హైవే రహదారులను జాతీయ రహదారులు గా మార్పు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.వి.సత్యన్నారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్ర రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్,గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.వంశీ కృష్ణ,జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వై.సత్యం నాయుడు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం.వి.నాగేష్ బాబు, జిల్లా విద్యా అధికారి డా, ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా వెనుకబడిన తరగతుల సాధికారిత అధికారి కృష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్.విజయ్ స్వరూప్, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా క్రీడా సాధికారిత అధికారి ఎస్.వెంకటేశ్వర రావు, జిల్లా సహకార శాఖ అధికారి పి. శ్రీరామ మూర్తి, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి శ్యామల, ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ అధికారి కనకదుర్గా, పోస్టల్ సహాయ పర్యవేక్షకులు మురళీ, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## బాలికల వికాసాని కి పటిష్ట చర్యలు



**కురుపాం /పార్వతీపురం, జనవరి 8:**బాల్య వివాహాలు, బాల్యంలో గర్భధారణ వంటి సంఘటనలు జరగకుండా అరికట్టి బాలికల వికాస దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, గ్రామ వార్డు సచివాలయం, పోలీసు వంటి శాఖలతో కిషోరీ వికాసం కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సం.11 నుంచి18 వయస్సు లోపు పాఠశాల కళాశాల విద్యార్థులు, సం.11 నుంచి18 వయస్సు లోపు బడి బయట విద్యార్థులను గ్రూపులుగా విభజించి పిల్లల సంరక్షణ, పోషణ అవసరాలు, కౌమార బాలికల సమస్యలు గుర్తించి వికాసానికి అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే బాల్య వివాహాలు అరికట్టడం, విద్య ఉద్యోగం కల్పనకు, పౌష్టికాహారం అందించడం, ఆత్మ సంరక్షణ, లైంగిక వేధింపుల నుండి రక్షణ వంటి అంశాలపై సమన్వయంతో నిర్మూలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పథక సంచాలకులు టి.కనకదుర్గా, సెట్ ఫీస్ బుక్ ఏ కార్యనిర్వహణాధికారి బి.రామ్ గోపాల్, జిల్లా విద్యా శాఖ అధికారి డా, ఎన్.తిరుపతి నాయుడు, స్వచ్ఛంద సంస్థలు అప్ హెూల్డ్, నీడ్, ఐ ఆర్ పి డబ్ల్యు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెన్ పవర్ క్యాలండరును ఆవిష్కరించిన గృహ నిర్మాణ శాఖ అధికారులు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి8:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో గృహ నిర్మాణ సంస్థ సహాయక ఇంజనీర్ కార్యాలయంలో ఏఈ సెగ్గే సూరిబాబు చేతుల మీదుగా ప్రశ్నించటం మన హక్కు నినాదంతో వెలువడుతున్న పెన్ పవర్ పత్రికా యొక్క 2025 సంవత్సరానికి చెందిన క్యాలెండర్ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ పి.చిట్టి పడాల్,ఎస్ అర్జున్ డి.ఇ.ఓ(హౌసింగ్) తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రాజేంద్రపాలెం 'పిసా' రచ్చ

- ఒకరిపై ఒకరు ఆరోపణ ప్రత్యారోపణలు



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 7:** మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో పిసా కమిటీ ఎన్నిక రచ్చ కొనసాగుతూనే ఉంది. ఒకరిపై ఒకరు ఆరోపణ ప్రత్యారోపణలతో ఎన్నిక హిట్ మరింత పెరుగుతోంది. ఈ నెల 3న రాజేంద్రపాలెం పిసా కమిటీ ఎన్నిక జరగాల్సి ఉండగా, కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 7న మన రాజేంద్రపాలెం గిరిజన భవన్ వేదికగా ఎన్నిక నిర్వహించే తలపెట్టారు. అయితే మధ్యాహ్నం వరకు పూర్తిగా కోరం లేకపోవడంతో, నిబంధనల ప్రకారం ఇక్కడ పూర్తిగా కమిటీ రద్దు అవుతుంది అని భావిస్తున్న తరుణంలో అక్కడ హాజరైన సభ్యులంతా ఒక ఏకాభిప్రాయానికి వచ్చి ఉపాధ్యక్షుడిగా లోత రవణను ఎన్నుకొని ఇక కార్యదర్శిగా సరుమూర్తి సూరిబాబు, లోతా రాజులు పోటీ పడగా, ఇందులో సరుమూర్తి సూరిబాబును కార్యదర్శిగా ఎన్నుకోగా, లోత రాజును తిరస్కరించారని గ్రామ పెద్దలు నర్సి కృష్ణ, దిబ్బ కుమారి, గూడెపు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే తను ప్రతిపాదించిన లోత రాజును కార్యదర్శిగా ఎన్నుకో లేదన్న అక్కసుతో, పంచాయతీ సర్పంచ్ పీట సింహాచలం తన అధికార బలంతో ఎన్నికల అధికారిని తప్పుదోవ పట్టించి, ఎన్నికను రద్దు చేయించారని నర్సి కృష్ణ, దిబ్బ కుమారి, గూడపు లక్ష్మణరావు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో ఓకే టీముగా లోత రవణ, తాను ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు పోటీ పడుతుండగా, సర్పంచ్ పీటా సింహాచలం దురుద్దేశపూర్వకంగా లోత రమణను ఉపాధ్యక్షుడుగా ప్రతిపాదించి, తన ప్రస్తావన మాత్రం తేలేదని సరుమూర్తి సూరిబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాము సోలాబు జోగంపేట నుండి సుమారు 200 మంది గ్రామస్తులను తీసుకు వచ్చినప్పటికీ, పదవులకు పోటీపడుతున్న కొంతమంది కనీస ఓటర్లను తీసుకురాలేకపోవడంతోనే ఎన్నిక రద్దయిందని సోలాబు గ్రామస్తులు, టిడిపి నేత కురుజు శ్రీనుబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద రాజేంద్రపాలెం పిసా ఎన్నిక నిలిచిపోయినప్పటికీ, రచ్చ మాత్రం కొనసాగుతూనే ఉంది.

## ప్రధానిబహిరంగ సభకు భారీగా తరలిన తూర్పు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విశాఖపట్నం జనవరి 08** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , జనసేన అధినేత ,ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు పిలుపుమేరకు ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్ లో వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహాసభకు 11,12,13, వార్డులనుండి తెలుగుదేశం,జనసేన,బిజెపి నాయకులు,కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు .ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరి. గోవింద్. పార్లమెంటరీకమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు.పోత్రకొండ ధర్మారావు.గాడి సత్యం.ఒమ్మి అప్పలరాజు. తురకపూడి బాలస్వామి . ఆధ్వర్యంలో వార్డుల నుండి భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు.

# సిపిఎం నాయకులు అరెస్టు





- స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలి
- స్టీల్ ప్లాంట్ పై నరేంద్ర మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణా రావు డిమాండ్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జనవరి 8:** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పై నరేంద్ర మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఎం శాంతియుతంగా మద్దిలపాలెం లో నిరసన తెలిపితే పోలీస్ లతో అక్రమంగా అరెస్టులు చేయించి ఆరిలోవ పోలీస్ స్టేషన్ కీ తరలించడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి కృష్ణా రావు తీవ్రంగా ఖండించారు.

మోడీ విశాఖ పర్యటనకు ముందే స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, సెయిల్ లో విలీనం చేస్తామని, ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ మోడీ ప్రకటన చేయకపోవడంతో ఈరోజు మోడీకీ నిరసన తెలియజేశామన్నారు. మోడీ పర్యటన వలన సిపిఎం ఆరిలోవ ప్రాంతం సిపిఎం నాయకుడు వి నరేంద్ర కుమార్ ని ఇంటి వద్దే అరెస్టు చేయడాన్ని తప్పుపట్టారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ను లకు ఆర్సిలార్ మిట్టల్ ప్రైవేటు స్టీల్ ప్లాంట్ పై ఎందుకంత ప్రేమన్నారు. ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగే విధంగా ఉద్యమాలు కొనసాగిస్తామని, అక్రమ అరెస్టులతో, నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. అదే సమయంలో ప్రైవేటు ఆర్సిలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే సహించేది లేదని తెలిపారు.

మద్దిలపాలెం ఆర్టీసీ వన్ డిపో వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేసిన సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు వి కృష్ణా రావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం సుబ్బారావు, పి పైడిరాజు, నాయుడు, నాయకులు ఓ అప్పారావు, చంద్రశేఖర్, కె పెంటరావు లతో పాటు మరో 13 మందిని అరెస్టు చేసి ఆరిలోవ పోలీస్ స్టేషన్ లో పెట్టారు.

## ప్రధాని భారీ బహిరంగ సభకు తరలి వెళ్లిన తెలుగుదేశం శ్రేణులు







**గాజువాక :పెన్ పవర్,జనవరి 08:** ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , జనసేన అధినేత ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ పిలుపుమేరకు ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్ లో జరుగుతున్న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహాసభకు 66 వార్డులోని తెలుగుదేశం, జనసేన, బిజెపి కార్యకర్తలు నాయకులు అధికంగా తరలి వెళ్లారు . ఈ కార్యక్రమం 66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో సి ఓ వనజ ,ఆర్పీలు మరియు మాజీ కౌన్సిలర్ లంకలత ,గోమాడ వాసు, చెరుకూరి నాగేశ్వరరావు, ఎండి ముర్తాజ ,స్వర్ణపుడి రాంబాయి, సరోజినీ, ఆశా, పర్వీన్, వరలక్ష్మి, స్వర్ణపుడి , లక్ష్మణ్ రావు అన్సర్ వల్లి షేక్ ఇమామ్ సాయిరాం అప్పారావు మోతి మిశ్రా చిత్తా తారకేశ్వరరావు బ్రహ్మానందం పవన్ ,శివ మున్నా ఖాన్ రమణ భాషా సచివాలయ సిబ్బంది మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రధానమంత్రి నరేంద్ర మోది కు ఘనస్వాగతం





- ఏయూ మైదానంలో జరిగే సభను విజయవంతం చేయండి..
- జండా ఊపి ర్యాల్లిని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం

**గాజువాక పెన్ పవర్, జనవరి 08:**గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో వడ్లపూడి నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోది సభకు ప్రజలను ఏ యు మైదానానికి తరలిస్తున్న బాస్సుకు జండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యన్ డి ఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ కు విచ్చేస్తున్న ప్రధానమంత్రి మోది గారుకు ఘనస్వాగతం పలకాలని, బహిరంగ సభను విజయవంతం చేయాలనీ ప్రజలను కోరారు.అనంతరం ప్రజలను సురక్షతంగా తీసుకెళ్లి తిరిగి గమ్యస్థానానికి చేర్చాలని సచివాలయం సిబ్బంది మరియు ఆర్పీలకు సూచించారు .ఈ కార్యక్రమం లో వార్డ్ అధ్యక్షుడు రాజన్ రాజు, అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, బిజెపి కో కన్వీనర్ లక్కరాజు సోమరాజు,సెక్రటరీ సత్తిబాబు, సీనియర్ నాయకులు ప్రగడ దానయ్య, సూరిశెట్టి పెంటారావు, శిరసపల్లి బాబురావు, కడుపుట్ల శ్రీను, ఇందిరా ప్రియదర్శిని,భాగ్యలక్ష్మి, కళ్యాణ్ చక్రవర్తి, సాయివర్మ,సచివాలయం సిబ్బంది ,ఆర్పీలు పాల్గొన్నారు.

## కొండగోకిరి సచివాలయంలో రెవెన్యూసదస్సు



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 7 :**బుధవారం మండలంలోని కొండగోకిరి గ్రామ సచివాలయంలో కొండ గోకిరి, కినపర్తి, రత్నంపేట పంచాయతీలకు సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుండి 93 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఆర్ ఓ ఎఫ్ ఆర్ కు సంబంధించి 26, వెబ్ లాండ్ కు19, కొత్త డిఫారం పట్టాలకోసం18, భూ సమస్యలకు సంబంధించి 6, ఎఫ్ లైన్ 2, కోర్టు కేసులు 3, మోటేషన్లు19 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సదస్సులో సర్పంచులు రేగటి ముసలి నాయుడు, రీమల శ్రీను, డిప్యూటీ తాసిల్దార్ కుమారస్వామి, ఆర్ఎస్ డిటి, అప్పన్న, మండల సర్వేయర్, స్థానిక సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గరుడాద్రి కొండ వెంకన్న ఆలయంలో మొక్కోటి ఏకాదశి పూజలకు సర్వం సిద్ధం





**గాజువాక: పెన్ పవర్, జనవరి 08:**ముక్కోటి ఏకాదశి పర్వదినం సంధర్భంగా గాజువాక బానోజీ తోట వాంబే కోలని గరుడాద్రి కొండపై వెంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతోందని ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ అన్నారు. దీనికి సంబంధించి కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మన రాష్ట్రంలో నే ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఇచ్చే రెండో వెంకన్న ఆలయం మన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం అని అన్నారు. ఈ మహా పర్వదినం నాడు స్వామివారిని దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్తర ద్వారా దర్శనం కలిపించి స్వామి వారి ఆశీస్సులు పొందెందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదలతో పాటు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్తన అప్పలరెడ్డి, పెంటకోట నాగేశ్వరరావు, తిప్పల స్వాతి, గొలుసు రామలక్ష్మి, ఉషారాణి, పద్మావతి, ఏ .లక్ష్మీకాంతం, టి .మంగ, కే .భవనమ్మ, ఎం. ఈశ్వరరావు, ఆర్ .లత, కే .మంగ, కే. లక్ష్మి, పి రమ, సరగడం సావిత్రమ్మ, జి .రూప, గవర లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు



# నర్సీపట్నంలో మకరజ్యోతి ఉత్సవాలకు అంకురార్పణ





**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 08) :** నర్సీపట్నంలో మకరజ్యోతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలోని నర్సీపట్నంలో వేంచేసి ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి వారి ఆలయంలో ప్రతి ఏటా మకర సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు మకరజ్యోతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఆలయ ధర్మకర్తలు చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించే అయ్యప్ప మకరజ్యోతి ఉత్సవాలను బుధవారం ఉదయం అయ్యన్నపాత్రుడు చిన్న కుమారుడు 24 వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ రాజేష్, సతీమణి దివ్యశ్రీ లు రాట వేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ముందుగా మూలవిరాట్ శ్రీఅయ్యప్ప స్వామివారిని దర్శించుకున్న అనంతరం రాజేష్ దంపతులు ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ మాట్లాడుతూ 13 నుంచి 15 వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయని, 14వ తేదీన విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం రథయాత్ర, క్లాసికల్ నృత్యాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రతిభావంతులకు సన్మానం, రాత్రి 7 నుంచి జబర్దస్త్ టీమ్, పల్సర్ బైక్ ఝూన్సీ ప్రదర్శనలు నిర్వహిస్తారని వివరించారు. కనుమ రోజు మణిపూర్ ఫోక్ డాన్స్ కూడా ఉంటుందని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు లంక ప్రసాద్, పెదిరెడ్ల ధనుంజయ్ మురళి, కొత్తకోట రామశేఖర్, గోగు వీరబాబు, ప్రముఖ వ్యాపారవేత్త జాలుమూరి బంగార్రాజు, జాలుమూరి రాజ్ కుమార్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రాజేంద్రపాలెం 'పిసా' రచ్చ

- ఒకరిపై ఒకరు ఆరోపణ ప్రత్యారోపణలు



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 7:** మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో పిసా కమిటీ ఎన్నిక రచ్చ కొనసాగుతూనే ఉంది. ఒకరిపై ఒకరు ఆరోపణ ప్రత్యారోపణలతో ఎన్నిక హిట్ మరింత పెరుగుతోంది. ఈ నెల 3న రాజేంద్రపాలెం పిసా కమిటీ ఎన్నిక జరగాల్సి ఉండగా, కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 7న మన రాజేంద్రపాలెం గిరిజన భవన్ వేదికగా ఎన్నిక నిర్వహించే తలపెట్టారు. అయితే మధ్యాహ్నం వరకు పూర్తిగా కోరం లేకపోవడంతో, నిబంధనల ప్రకారం ఇక్కడ పూర్తిగా కమిటీ రద్దు అవుతుంది అని భావిస్తున్న తరుణంలో అక్కడ హాజరైన సభ్యులంతా ఒక ఏకాభిప్రాయానికి వచ్చి ఉపాధ్యక్షుడిగా లోత రవణను ఎన్నుకొని ఇక కార్యదర్శిగా సరుమూర్తి సూరిబాబు, లోతా రాజులు పోటీ పడగా, ఇందులో సరుమూర్తి సూరిబాబును కార్యదర్శిగా ఎన్నుకోగా, లోత రాజును తిరస్కరించారని గ్రామ పెద్దలు నర్సి కృష్ణ, దిబ్బ కుమారి, గూడెపు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే తను ప్రతిపాదించిన లోత రాజును కార్యదర్శిగా ఎన్నుకో లేదన్న అక్కసుతో, పంచాయతీ సర్పంచ్ పీట సింహాచలం తన అధికార బలంతో ఎన్నికల అధికారిని తప్పుదోవ పట్టించి, ఎన్నికను రద్దు చేయించారని నర్సి కృష్ణ, దిబ్బ కుమారి, గూడపు లక్ష్మణరావు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో ఒకే టీముగా లోత రవణ, తాను ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు పోటీ పడుతుండగా, సర్పంచ్ పీటా సింహాచలం దురుద్దేశపూర్వకంగా లోత రమణను ఉపాధ్యక్షుడుగా ప్రతిపాదించి, తన ప్రస్తావన మాత్రం తేలేదని సరుమూర్తి సూరిబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాము సోలాబు జోగంపేట నుండి సుమారు 200 మంది గ్రామస్తులను తీసుకు వచ్చినప్పటికీ, పదవులకు పోటీపడుతున్న కొంతమంది కనీస ఓటర్లను తీసుకురాలేకపోవడంతోనే ఎన్నిక రద్దయిందని సోలాబు గ్రామస్తులు, టిడిపి నేత కురుజు శ్రీనుబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద రాజేంద్రపాలెం పిసా ఎన్నిక నిలిచిపోయినప్పటికీ, రచ్చ మాత్రం కొనసాగుతూనే ఉంది.

## ఆటో డ్రైవర్ లకు ట్రాఫిక్ పై అవగాహన



**అరకులోయ పెన్ పవర్ 8:** అల్లూరి జిల్లా పాడేరు డీఎస్పీ కె.ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో అరకులోయ పరిధిలో ఆటో డ్రైవర్లకు బుదవారం అవగహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్,యూనిఫామ్,ఓవర్ లోడి,ఓవర్ స్పీడ్,డ్రైవింగ్ లైసెన్స్,ఇవన్నీ పాటించాలని లేనిచో చట్టపరమైన చర్య తీసుకోబడును, మద్యం తాగి డ్రైవింగ్ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని, ప్రయాణికుల వద్ద అధిక డబ్బులు వసూలు చేసిన తగు చర్య తీసుకోబడతాయని హెచ్చరించారు. 18 సంవత్సరాలు లోపు పిల్లలు డ్రైవింగ్ చేయకూడదని డ్రైవింగ్ చేసినట్లయితే ఆటో ఇచ్చిన తల్లితండ్రుల మీద ఆటో ఓనర్ మీద క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. సంక్రాంతి పండగలో అధికంగా ప్రయాణికులు వచ్చే అవకాశాలు ఉన్న కారణంగా ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ అంతర్యం కలిగించకుండా చూడాలని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి గారు అరుకు ఎస్సై జి.గోపాల్ రావు పోలీస్ సిబ్బంది, అరకు మండల పరిధిలో ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## జీవనోపాధి మెరుగుకు నైపుణ్య శిక్షణలు-డా.రోహిణి





**పాడేరు,పెన్ పవర్ జనవరి 8.** పాడేరు జి.మాడుగుల,జీవనోపాధి మెరుగుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి శిక్షణలు అందిస్తామని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారిణి డాక్టర్ పి.రోహిణి తెలిపారు.గూడెం కొత్తవీధి మండలంలో కౌమార దశలోనే పాఠశాల నుండి డ్రాప్ అయిన 402 మంది బాలికలను గుర్తించడం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న 102 మందితో సమావేశం నిర్వహించి వారికి ముందస్తు వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అదేవిధంగా వివిధ కారణాలతో చదువు మధ్యలోనే మాని వేసిన విద్యార్థినులకు తిరిగి బడికి వెళ్లాలని ప్రోత్సహించడంతోపాటు వారి జీవనోపాధి మెరుగుకు అవసరమైన శిక్షణలు అందిస్తామని అవగాహన కల్పించారు. వారికి ఆసక్తి ఉన్న రంగాలలోని శిక్షణలు అందిస్తామని ఆమె సూచించారు. అదేవిధంగా నైపుణ్య శిక్షణలు పొంది జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు గల అవకాశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఏ లక్ష్మి,వారి సిబ్బంది, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## 44 పీసాకమిటీల ఎన్నికలు పూర్తి, 3 పెండింగ్...!

- కొయ్యూరు ఎంపీడీవో ఎస్ కేవి ప్రసాద్ వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 7:** మండలంలో మొత్తం 47 పీసా కమిటీలకు గాను 44 కమిటీలకు ఎన్నికలు పూర్తయినట్లు, మూడు కమిటీల ఎన్నికలు పెండింగ్లో ఉన్నట్టు ఎంపీడీవో ఎస్ కే వి ప్రసాద్ తెలిపారు. పెండింగ్లో రాజేంద్రపాలెం, రేవళ్ల, కినపర్తి కమిటీలు ఉన్నట్టు ఆయన వివరించారు.

మండలపరిషత్ లో రివ్యూ మీటింగ్ :

ఇదిలా ఉండగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్ రివ్యూ నిర్వహించారు. పంచాయతీలలో జరుగుతున్న వివిధ సర్వేలు, ఇతరత్రా కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఈ రివ్యూలో ఎంపీడీవో సూచించారు.

## ముక్కోటి ఏకాదశి నాడు సత్యదేవుని ఆలయంలో పల్లకిసేవ



**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 08) :** ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం శివారు ఉత్తరవాహినీ నదీ తీరాన వేంచేసి ఉన్న శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో పల్లకి సేవ, భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉదయం 6 గంటలకు ఆలయం చుట్టూ 12సార్లు పల్లకి సేవ జరుగుతుందని, తరువాత భక్తులకు ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు జరుగుతాయని తెలిపారు. ఈ ముఖ్య కార్యక్రమాలలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దంపతులు ప్రత్యేక అతిధులుగా పాల్గొంటారని తెలిపారు. భక్తులు యావన్మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించి తరింపవలసిందిగా ఆలయ ప్రధాన అర్చకులు పి.వి.బి. రాము కోరారు.

# గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.



### విద్యార్థుల తలిదండ్రులకు ఐడి కార్డులు.
### గంజాయి నిర్మూలనకు కమిటీలు ఏర్పాట్లు.
### ఐటిడిఏ పి.ఓ.వి.అభిషేక్

**పాడేరు,పెన్ పవర్ జనవరి 8.** అల్లూరి జిల్లా గిరిజన ఆశ్రమ స్కూల్స్ పై గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటిడిఏ

పి.ఓ.వి.అభిషేక్ ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో ఒకే ప్రామాణికా విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. పది విద్యార్థుల వంద రోజుల కార్య చరణ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్తో ఐటిడిఏ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జారీ చేసిన ఫార్మాట్.ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతీ నెల నివేదికలు సమర్పించాలని స్పష్టం చేసారు.విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిక్ రూంలో ఉంచాలను సూచించారు.అత్యవసరమైతే వెంటనే అసుపత్రికి తరలించి తలిదండ్రులకు,ఎటిడబ్ల్యూఓ లకు సమాచారం అందించాలని చెప్పారు. విద్యార్థుల తలిదండ్రులకు, గార్డియన్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు కలిగిన వారితో విద్యార్థులను బయటకు పంపించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మూమెంట్ రిజిష్టర్లు ఏర్పాటు చేయాలన్నారు.ఆదివారం ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు మాత్రమే తలిదండ్రులను,గార్డియన్లను అనుమతించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో విద్యార్థులను బయటకు పంపించకూడన్నారు.

పది విద్యార్థుల వంద రోజుల కార్యచరణ ప్రణాళికను,స్టడీ మెటీరియల్ను విడుదల చేసారు.ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల స్టడీ అవర్ నిర్వహించాలని చెప్పారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యా సామర్థ్యాలు మెరుగు పరచాలని పేర్కొన్నారు. పాఠశాలల పరిసరాల్లో గంజాయి వాసన రాకూడదన్నారు.విద్యార్థులు ఎక్కడైనా గంజాయి వినియోగిస్తే తగిన చర్యలు చేపట్టి కౌన్సిలింగ్ ఇప్పించాలని,తలిదండ్రులకు సమాచారం అందించాలని ఆదేశించారు.మార్గదర్శిని కార్యక్రమం అమలు చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై కఠిన చర్యలు చేపట్టిందన్నారు. ఈగల్ ఐ.జి ఇటీవల ఏజెన్సీలో పెదబయలు మండలంలో పర్యటించి ఎనిమిది ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తు చేసారు.పాఠశాలలు,మండల స్థాయి, ఐటిడి ఏ స్థాయిలో గంజాయి నిర్మూలన పై కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.గంజాయి పండించినా తరలించినా, వినియోగించినా వెంటనే 1972 కాల్ సెంటర్కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గంజాయి వినియోగించే విద్యార్థులు ఉంటే డి ఎడిక్షన్ సెంటర్కు తరలించి కౌన్సిలింగ్ చేయాలని చెప్పారు.

ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని,డి ఇ ఓ పి. బ్రహ్మాజీ రావు, 11 మండలాల ఎటిడబ్ల్యూ ఓలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్.సి కులగణన పై సోషల్ ఆడిట్ పూర్తి చేయుటకు గడువు పొడిగింపు.

**రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలన్ని రాష్ట్ర ప్రభుత్వం.**



**పాడేరు,పెన్ పవర్ జనవరి 8.** అల్లూరి జిల్లా రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను తేది 26.12.2024 నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించినారు.దీనిపై అభ్యంతరరాలు స్వీకరించడానికి గడువును జనవరి 12వ తేది వరకు పొడిగించినారు.జనవరి 16.వ తేది వరకు అభ్యంతరాలను క్షేత్ర స్దాయిలో పరిశీలిస్తారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 20.వ తేదిన కులగణన తుది వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ మేరకు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం జి.వొ.ఆర్.టి.నెం. 01,తేది 07.01.2025 ద్వారా మార్గదర్శకాలను విడుదల చేసింది.మూడు దశలలో తనిఖీ.పేరు,అధార్ నంబర్, పుట్టిన తేది వయస్సు, ఉపకులం,మరుగుదొడ్డి సౌకర్యం,తాగునీటి సౌకర్యం, విద్యార్హత,వృత్తి వ్యవసాయంఇతర వివరాలను గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు.ఈ డేటా పై అభ్యంతారాలను వీఆర్వో స్వీకరిస్తారు.వీటిని మూడు దశలలో తనిఖీ చేస్తారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను ఆర్ఐ కి నివేదిస్తారు.వీటిని ఆర్ ఐ పునపరిశీలించి తహసీల్దరుకు రికమండ్ చేస్తారు.తహసీల్దార్ వీఆర్వో ,ఆర్ఐ ల నివేదికలో వివరాలను పరిశీలించి,తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని ఫోర్టల్ లో పొందుపరుస్తారు. పొందు పరిచిన వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించెందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాల్ని ర్యాండమ్ గా తనిఖీ చేయిస్తారు.ఈ సోషల్ ఆడిట్ ను కలెక్టరు,ఆర్డీవోలు పర్యవేక్షిస్తారు.

## భారీ బహిరంగ సభలో జనసేన అధినేత

**ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సభను ఉత్సాహభరితం చేశాయి**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జనవరి 8:**"కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నడిచిన ఒక నిరర్ధక నడకకు బదులుగా, సదాశయంతో ప్రజల గుండెల్లో దేశభక్తిని నింపిన నాయకుడు మాత్రమే దేశానికి దిక్సూచి అవుతారు" అని అన్నారు. స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర భారత్, మరియు పటిష్టమైన భారతదేశం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.

ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులను మరియు 7.5 లక్షల ఉపాధి అవకాశాలను అందించారు" అని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు.

పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ప్రశంసిస్తూ, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్డీఏ కూటమిపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు సభలోని ప్రజలను ఆకట్టుకున్నాయి. వారి మాటల ద్వారా అభివృద్ధి పట్ల రాష్ట్రం లోకమంతటా చర్చనీయాంశంగా మారింది.

## విశాఖ కు మరోసారి మొండి చెయ్యి చూపిన మోదీ

- విశాఖ స్టీల్ ప్లాంట్ కి ద్రోహం...మిట్టల్ కి దాసోహం
- సిపిఎం విశాఖ జిల్లా కమిటి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జనవరి 8:**విశాఖ సాక్షిగా మోదీ మరోసారి ద్రోహం చేసారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత ముడి ఇనుప గనులు కేటాయింపు, కాపిటల్ రీ స్ట్రచ్చరింగ్ క్రింద రు 18 వేల కోట్లు పై ప్రధాని ప్రకటన చేయక పోవటం విశాఖకు, ఉత్తరాంధ్రకు మరో సారి ద్రోహం చేయడమే. రాష్ట్ర ముఖ్యమంత్రి కనీసం విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆర్శిలార్ మిట్టల్ స్టీల్ కి అవసరమైన ముడి ఇనుప గనుల సరఫరా, ఇతర అనుమతులు గురించి సాగిల పడి మాట్లాడటం విశాఖ స్టీల్ ప్లాంట్ కి ద్రోహం చేయడమే. కేంద్ర బీజేపీ, రాష్ట్ర టిడిపి, జనసేన కూటమి కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్ ను మిట్టల్ కి బలిచ్చేలా కుట్ర పన్నినట్టు ఈ రోజు మోడీ బహిరంగ సభతో తేలిపోయింది. దీనికి టీడీపీ, జనసేన కూటమి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

ఆయన ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై స్పందించక పోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది. ఆర్భాటంగా ఏర్పాటు చేసిన సభ, రోడ్ షోలకు తగ్గట్లుగా ప్రజలకు చేసిన మేలు లేదు.

విభజన చట్ట ప్రకారం రావలసిన విశాఖ మెట్రో రైల్ మాట కూడా మాట్లాడలేదు. ఇక రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీల సంగతి పూర్తిగా మరిచారు.

పక్కనే ఉన్న ముఖ్య మంత్రి చంద్రబాబు. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కనీసంగా కూడా అడగలేదు. సరికదా, ఆయనను సంపన్నం చేసుకోవడానికే ఇద్దరూ పోటీ పడ్డారు. ముచ్చటగా ముగ్గురూ కలిపి ఈ సభా వేదికగా ఆంధ్ర రాష్ట్రానికి మోసం చేశారు. సభంతా ఒకర్నొకరు పొగుడుకోవడంతోనే సరిపోయింది.

ప్రజలు ఒద్దు మొర్రో అంటున్న నక్కపల్లి బల్క్ డ్రగ్స్ ప్లాంటుకు శంకుస్థాపన చేశారు. నిర్వాసితుల
ఊసెత్తకుండా గ్రీన్ ఎనర్జీ, అత్యధిక ఆదాయం గడిస్తున్న వాల్తేర్ రైల్వే డివిజన్ కొనసాగించాలని ఎంత కోరినా దాన్ని పక్కన పెట్టారు. పదేళ్ళ నుండి ఊరిస్తూ, ఊరిస్తూ ఎట్టకేలకు రైల్వే జోన్ కు శంకుస్థాపన చేయడంలో గర్వ పడవలసిన దేముంది? పదేళ్ళ క్రితం రావలసినది ఇంత ఆలస్యం చేసినందుకా?

స్టీల్ ప్లాంటుపై ప్రధాని ప్రకటన చేయాలని కోరుతూ, ప్రదర్శన చేస్తున్న వామపక్ష నాయకులను అరె స్టు చేయడం, ముందు రోజు నుండే సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఇప్పటికైనా స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, సెయిల్ లో మెర్జ్ చేయాలని, సొంత గనులు కేటాయించాలని, బలోపేతం చేయాలని డిమాండు చేస్తున్నాం.

## గ్రుక్కెడు త్రాగునీరు కల్పించండి మహాప్రభు

- రెండు సంవత్సరాలుగా శరీకాండం మా గ్రామా నికి తాగునీరు లేదు
- సర్పంచ్ మండల సమావేశంలో చిన్నారావు ఆవేదన



**పద్మనాభం. పెన్ పవర్, జనవరి 08 :**గత రెండు సంవత్సరాలుగా శరీకాండం గ్రామా నికి తాగునీరు కరువైందని ఆ గ్రామానికి చెందిన సర్పంచ్ పి చిన్నారావు మండల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన పద్మనాభం ఎం.పీ.డీ.వో కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మండల సమీక్ష సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు కే రాం బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండల సమా వేశం 11 16 నిమిషాలకు ప్రారంభమై ఒంటి గంట ఐదు నిమిషాలకు ముగిసింది ఈ మధ్యకా లంలో ఎం.పీ.పీ రాంబాబు పలు శాఖల అధికా రులతో సర్పంచులు ఎంపీటీసీలు సమక్షంలో శాఖల వారీగా సమీక్ష చేశారు. ముందుగా రోడ్లు భవనాలశాఖ ఏ.ఈ. వివరణ కోరగా చిన్నాపు రం నుండి నీలకుండీల వరకు ఉన్న రోడ్ను మర మత్తులు చేయడం జరి గిందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఎటువం టి అనుమతులు తీసుకో కుండా కాలువలో తీసేస్తు న్నారని దీనివల్ల రోడ్లు పాడైపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో శరీకాండం సర్పంచ్ చిన్నా రావు. బి తాళ్లవలస. సర్పంచ్ చందక శ్రీను మం డలానికి. ప్రధాన రహదారిగా ఉన్న పద్మనాభం నుండి రెడ్డిపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో రెడ్డిపల్లి స్టేట్ బ్యాంకు నుండి కోట్ల గుండం ఎత్తు వరకు ఉన్న రోడ్డు గత పది సంవత్సరాలుగా సరిగా బాగు లేక ప్రయా ణికులు నానా యాతన పడుతున్నారు. ఈ పనులు సంక్రాంతి తర్వాత ప్రారం భిస్తామని ఆమె అన్నారు. ఈ సమయం లో ఎం.పీ.పీ రాంబాబు చేసుకుని ముందుగానే తాతకాలికంగా పనులు చేపట్టకపోతే గ్రామస్థా యి నుండి తీవ్ర ప్రతిఘటన వస్తుందని ఆయన అన్నారు. గ్రామస్థాయి నుండి ఎటువంటి సమ స్యలు లేకుండా పనులు చేయాలని ఆర్.అండ్ బి.శాఖ అధికారులను కోరారు.

# ఏ.పీ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్






- చంద్రబాబు నేతృత్వంలో 2047 విజన్ సాకారం అవుతుంది
- పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు
- విశాఖలో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ లో మంత్రి నారా లోకేష్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జనవ రి 08. :**ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో 2047 విజన్ సాకారం అవుతుం దని, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్ గా మారుతుందని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ డీటీఐ(డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ), ఎస్టీపీఐ (సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్-2025 కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్య అ తిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వ లన చేసి సమ్మిట్ ను లాంఛనంగా ప్రారంభించా రు. ఏడు రంగాల్లో ఐటీ అభివృద్ధి, డీప్ టెక్నా లజీ ప్రాముఖ్యత, స్టార్టప్ ల వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మట్లాడుతూ,ఏ.పీలో సాం కేతిక అభివృద్ధికి దిశానిర్దేశం చేయనున్న ఈ సమ్మిట్ లో పాల్గొనడం చాలా గర్వంగా ఉంది. భవిష్యత్ లో ఏపీ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ హబ్ గా మారుతుంది. ఇన్నోవేషన్, డీప్ టెక్ నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి సాధ్యపడుతుంది. అభివృద్ధికి ఇన్నోవేషన్ చాలా ముఖ్యం. ఏఐ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్, ఎడ్యుటెక్, ఎనర్జీ స్మార్ట్ సొల్యూషన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ రోబోయే రోజుల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. సామాజిక సమస్యల పరిష్కారానికి ఐటీ,ఎలక్ట్రానిక్స్,మెడ్ టెక్, స్మార్ట్ టెక్నాలజీస్ కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యరంగంలో ఆధునిక సాం కేతిక పరిజ్ఞానం ఏవిధమైన మార్పులు తీసు కువచ్చిందో మనం చూశాం. ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం2047 నాటికి ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిది ద్దుతాం. 2020 విజన్ భాగంగా చంద్రబాబు నాయుడు ఐ.టీ.ని అభివృద్ధి చేశారు. ఇప్పుడు విజన్ 2047లో భాగస్వామ్యం కావడం నా అదృష్టం. చంద్రబాబునాయుడు సారథ్యంలో 2047 కలను సాకారం చేస్తాం. ఉద్యోగాలు పొందేందుకు, కల్పించేందుకు ఇన్నోవేషన్ తో పాటు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకు వస్తాం. ఉన్నత విద్యను సంస్కరిస్తాం. ఎన్.ఐ. ఆర్.ఎఫ్ ర్యాంకింగ్స్ లో ఏపీ ప్రస్తుతం 9వ స్థా నంలో ఉంది.దీనిని 3వ స్థానానికి తీసుకువ స్తాం. ఇందుకు పరిశ్రమ వర్గాలు తమవంతు సహకారం అందించాలి. విశాఖలో ఏ.ఐ యూని వర్సిటీ ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర సాంకేతిక విప్ల వంలో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ తనవం తు పాత్ర పోషించాలి. సంక్షోభాలనే అవకాశాలు గా మలచుకోవాలని మా నాయకుడు చెప్పారు. ఇది మన అవకాశం.అభివృద్ధిని వికేంద్రీకరిస్తాం

ఏపీ అభివృద్ధికి ప్రధాని ఎంతో సహకరిస్తున్నా రు. నేడు 2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తాం.రాయలసీమలో ని అనంతపూర్ కు కియా పరిశ్రమ రావడం ద్వా రా తలసరి ఆదాయంలో 3వ స్థానంలో ఉండి గోదావరి జిల్లాలతో పోటీపడుతోంది. కర్నూలు ను రెన్యువబుల్ ఎనర్జీ హబ్ గా రూపొందిస్తాం. చిత్తూరు, కడపను ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చ రింగ్ హబ్ గా మారుస్తాం. గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా మారుస్తాం. ఉత్తరాంధ్రకు త్వర లోనే ప్రపంచంలోనే అతిపెద్ద కెమికల్ పార్క్ రా బోతోంది. విశాఖకు డేటా సెంటర్ తీసుకువస్తాం. త్వరలోనే టీసీఎస్ రాబోతోంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను నెలకొల్పుతాం. పారిశ్రా మికవేత్తలకు అన్ని విధాల సహకారం అందిస్తా మని మంత్రి నారా లోకేష్ తెలిపారు.విశాఖ ఎంపీ మతుకుమిల్లి భరత్ మాట్లాడుతూ. ఏపీ లో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. సంక్షోభాలనే అవకాశాలుగా మల్చుకుందాం. ఈ ఐదేళ్లు చాలా కీలకం. నూతన ఆవిష్కరణ లకు సిద్ధంగా ఉన్నాం.విశాఖను ఐటీ హబ్ గా మా ర్చేందుకు అవసరమైన ఎకో సిస్టమ్ ను అభి వృద్ధి చేస్తాం.పరిశోధన రంగాన్ని కూడా మెరుగు పర్చాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో డీటీఎన్ఎఫ్ ఛైర్మన్ శ్రీధర్ కొస రాజుతో పాటు కేడీఈఎమ్ ఛైర్మన్ బీవీ నాయు డు, అలోన్ఓఎస్ కో-ఫౌండర్ సీపీ గుర్నాని, ఎస్టీ పీఐ డైరెక్టర్ శ్రీమతి సి.కవిత, ఐ.టీ.ఏ.ఏపీ ప్రెసి డెంట్ లక్ష్మీ ముక్కవిల్లి తదితరులు పాల్గొన్నారు





# కన్నుల విందుగా ప్రధాని రోడ్ షో





- భారత ప్రధాని కి అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన విశాఖవాసులు
- పూలతో ప్రజల నీరాజనాలు అందుకున్న ప్రధాని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి
- వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకు కొనసాగిన రోడ్ షో
- ప్రజలకు అభివాదం చేస్తూ సభా వేదికకు చేరుకున్న పీ.ఎం

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జనవరి 08 :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖలో నిర్వహించిన రోడ్ షో లో విశాఖ వాసులు అడు గడుగునా బ్రహ్మరథం పట్టారు. ఒక రోజు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం విశాఖపట్నం చేరుకున్న పీ.ఎం ఐ.ఎన్.ఎస్ డేగా నుంచి సా యంత్రం స్థానిక వెంకటాద్రి వంటిల్లుకు చేరుకు న్నారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ టాప్ వాహనంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ము ఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రోడ్ షో నిర్వహించారు. ఈ క్రమంలో ప్రధాని, ముఖ్య మంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రజల నుంచి పూల వర్షంతో నీరాజనాలు అందుకున్నారు. వెంకటా ద్రి వంటిల్లు నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశా ల మైదానం వరకు సుమారు కిలో మీట రు మేర భారత ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబా బు నాయుడు, పవన్ కళ్యాణ్ వాహనంపై నుంచి ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసి ముందుకు సాగారు. వేలాదిగా తరలివచ్చి న అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేసు కుంటూ ప్రధాని ముందుకు సాగారు. ఈ రోడ్ షోలో కూటమి నేతలు, పార్టీ శ్రేణులు, అభిమా నులు భారీ సంఖ్యలో హాజరు కాగా మోదీ, మోదీ.అనే నామస్మరణతో విశాఖ ప్రాంతం మారుమోగింది. మోదీ, చంద్రబాబు, పవన్ రోడ్ షో పట్ల విశాఖ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.





# 6 వేల లీటర్ల సారా పులుపు ధ్వంసం



**నర్సీపట్నం, పెన్ పవర్ ( జనవరి 08) :**నర్సీపట్నం రూరల్ పోలీసులు 6000 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు నర్సీపట్నం మండలం ధర్మసాగరం శివారు జీడితోటల్లో నాటు సారా బట్టీలపై సీఐ రేవతమ్మ, ఎస్సై రాజారావు మరియు సిబ్బందితో దాడులు చేశారు. నాటు సారా తయారీకి ఉపయోగించే పులుపును దాచి ఉంచిన ప్రదేశాలను గుర్తించారు. తమ సిబ్బందితో వాటిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడుతూ నాటు సారా తయారీ, అమ్మకాలకు సంబంధించి ప్రజలకు ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాగే ఇటువంటి చర్యలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఏపీకి మోదీ తీరని ద్రోహం

- స్టీల్ ప్లాంట్ పై ప్రకటన చేయకపోవడం గర్హనీయమే
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జనవరి 8:**ప్రధాని మోదీ సహా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎవ్వరూ స్టీల్ ప్లాంట్ విషయం ప్రస్తావన చేయకపోవడం రాష్ట్ర ప్రజలను వంచన చేయడమేనని, ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైపల్యమేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి ధ్వజ మెత్తారు.

విశాఖపట్నం నగరం లో సభ పెట్టి విశాఖపట్నం స్టీల్ ను అమ్మేస్తాము అని చెప్పి వెళ్ళినట్టె తాము భావిస్తున్నామని పేర్కొన్నారు.

మోదీతో అంటకాగుతూ కూడా రాష్ట్ర ప్రయోజనం కోసం నోరు మెదపని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరు చరిత్ర హినులుగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

ప్రత్యేక హెూదా సహా మోదీ నోటి వెంట వచ్చిన ఏ హామీ ఇప్పటికీ పూర్తి కాలేదనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు అని గుర్తు చేశారు.

ఇటీవల ఎన్నిక మేని ఫెస్టోలో టీడీపీ, బీజేపీ, జనసేన లు స్టీల్ ప్లాంటును కాపాడుకుంటామని చెప్పి ఇపుడు మోదీ ముందు మాట్లాడలేక పోవడం దారుణమని మండిపడ్డారు.

మాటల గారడి చేసి పోవడానికి విశాఖపట్నం వచ్చి వెళ్లిన మోడికి సాగిల పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పి మోదీ పాలనపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచన చేశారు.

# పీఎం జన్మన్, పీఎం గ్రామీణ్ గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయండి





ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని ప్రధానమంత్రి జన్ మాన్ హౌసింగ్ పథకం కింద మంజూరైన ఇండ్ల నిర్మాణం వేగవంతంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గూడెం కొత్త వీధి మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు కోరారు.గూడెం కొత్తవీధి మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది మరియు గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గూడెం కొత్తవీధి మండలానికి ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద 1985 గృహాలు మంజూరు కాగా అందులో1404 గ్రౌండింగ్ చేయడం జరిగిందని,అలాగే పీఎం ఏవై గ్రామీణ హౌసింగ్ పథకం కింద 2027 గృహాలు మంజూరు కాగా అందులో 2109 గ్రౌండింగ్ అయ్యాయని వీటి నిర్మాణాలు అన్నిటిని మార్చి 25 కల్లా పూర్తి చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన ఆదేశాల మేరకు వీటిని వేగవంతంగా అమలు చేయడానికి గాను సచివాలయ సిబ్బందికి హౌసింగ్ సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించడం జరుగుతుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.ఈ మేరకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న పనుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందించే విధంగా పనులు వేగవంతంగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే సచివాలయ సిబ్బంది తమ సమీప సచివాలయ పరిధిలోని అన్ని గృహ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలను కల్పించి వేగవంతంగా గృహాలను నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడెం కొత్త వీధి హౌసింగ్ ఏఈ సెగ్గే సూరిబాబు,ఈవో పి ఆర్ డి పాపారావు, వర్క్ ఇన్స్పెక్టర్ చిట్టి పడాల్,సిబ్బంది అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

● చింతపల్లి ఏ.వో. శ్రీనివాస్.



**చింతపల్లి పెన్ పవర్ జనవరి 8 :-** మండలంలోని చిన్న బరడ, చింతలూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించడం జరిగిందని చింతపల్లి వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ప్రకృతి వ్యవసాయంపై అవగాహనను , బిందు సేద్యం యొక్క ఆవశ్యకతను గూర్చి తెలియజేయడం జరిగిందన్నారు. అలాగే మాదకద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన మరియు గంజాయి పంటకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన ,భూసార పరీక్షలు వాటి ప్రాముఖ్యత వ్యవసాయ యంత్ర పరికరాలు పి.ఎం .కిసాన్ జాతీయ ఆహార భద్రత పథకం, ఈ పంట ప్రాముఖ్యతను గూర్చి రైతులకు వివరించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి విశాఖ పర్యటనకు తరలి వెళ్లిన కూటమి నాయకులు





**చింతపల్లి పెన్ పవర్ జనవరి 8:-** విశాఖ పట్నం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేయడానికి విచ్చేయుచున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడి,ఆంధ్ర ప్రదేశ్ టీడీపీ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనసేన పార్టీ రాష్ట్ర ఉప ముఖ్యంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేయడానికి

చింతపల్లి మండలం నుంచి బస్ తో బయలుదేరుతున్న కూటమి నాయకులు... జనసేన పార్టీ మండల అధ్యక్షులు బుజ్జి బాబు, కార్యకర్తలతో విశాఖ తరలి వెళ్లారు

## జిల్లా అండర్-12 క్రికెట్ టీమ్ కి అమలాపురం విద్యార్థి ఎంపిక

**అమలాపురం రూరల్, పెన్ పవర్, జనవరి,8**

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్ -12 క్రికెట్ పోటీలకు అమలాపురం సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ కి చెందిన ఆరవ తరగతి విద్యార్థి సబ్బెళ్ళ విశ్వ ఫణీందర్ రెడ్డి గేమ్ ఆన్ క్రికెట్ అకాడమీ లో కోచింగ్ తీసుకుని ఎంపికయినట్టు పాఠశాల డైరెక్టర్ శ్రీ రవణ%శీ% వేణుగోపాల్ రావు గారు, ప్రిన్సిపాల్ శ్రీమతి గౌసియా బేగం తెలిపారు.ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు కాకినాడలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరుపున ఫణీందర్ ఆడి మంచి ప్రతిభ కనబరిచారన్నారు.

## KSR టీం ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఆటలు పోటీలు.....





**నాతవరం పెన్ పవర్ (జనవరి 08):** మండల కేంద్రమైన నాతవరంలో కేఎస్ఆర్ టీం ఆధ్వర్యంలో ఆటలు పోటీలు నిర్వహించడం జరుగుతుందని పార్టీలకు అతీతంగా ఎన్నారై సతీష ,కిరణ్ ,వెంకటరమణ మరియు నాతవరం గ్రామంలోని యువత,అలాగే నాయకులు సహకారంతో గత మూడు సంవత్సరాల నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు అన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని,యువత చదువుతోపాటు,ఆటల పోటీల్లో కూడా రాణిస్తే ఇటు శారీరకంగా అటు మానసికంగా మంచి ఉత్సాహంగా దృఢంగా ఉంటారని గ్రామ పెద్దలు తెలియజేసారు.ఈ ఆటల పోటీల్లో ఇంకా ఎవరైనా పాల్గొనదలచిన వారు ఉంటే %ఖూ=% కమిటీ వారిని సంప్రదించవలెనని,ఈ ఆటల పోటీల్లో విజేతగా నిలిచిన వారికి మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి,తృతీయ బహుమతి ఇవ్వడం జరుగుతుందని వారు అన్నారు.ఈ మూడింటిలో ఒక బహుమతికి సంబంధించిన నగదును గ్రామ పెద్ద అయిన పైల పోతురాజు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు,నేతల విజయ్ కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు పైల పోతురాజు, టిడిపి నాయకులు శెట్టి సత్యనారాయణ,పారుపల్లి దాసు, బంగారు సూరిబాబు, తెలుగు యువత అధ్యక్షులు శెట్టిలోవ, గ్రామ పార్టీ అధ్యక్షుడు శెట్టి నానాజీ, నాతవరం ఐ టి డి పి శెట్టి గోపి, సామర్ల రామారావు, ఇటం శెట్టి సీతారాం ,చింతకాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గిరి బాలికల “జీవనోపాధి” మెరుగుకు నైపుణ్య శిక్షణలు





జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ రోహిణి

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 8:**గిరిజన ప్రాంత గిరి బాలికల జీవనోపాధి మెరుగుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి శిక్షణలు అందిస్తామని అల్లూరి జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారిణి డాక్టర్ పి. రోహిణి తెలిపారు.గూడెం కొత్తవీధి మండలంలో కౌమార దశలోనే పాఠశాల నుండి డ్రాప్ అయిన 402 మంది బాలికలను గుర్తించడం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న 102 మందితో సమావేశం నిర్వహించి వారికి ముందస్తు వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.అదే విధంగా వివిధ కారణాలతో చదువు మధ్యలోనే మాని వేసిన విద్యార్థినులకు తిరిగి బడికి వెళ్లాలని ప్రోత్సహించడంతోపాటు వారి జీవనోపాధి మెరుగుకు అవసరమైన శిక్షణలు అందిస్తామని అవగాహన కల్పించారు.వారికి ఆసక్తి ఉన్న రంగాలలోని శిక్షణలు అందిస్తామని ఆమె సూచించారు.



అదేవిధంగా నైపుణ్య శిక్షణలు పొంది జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు గల అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఏ. లక్ష్మి దేవి సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు,స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 11 న చలో తిరుపతి

● బీ.సీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి.
● బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ తొలగించా లి
● విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహా సభలు జనవరి 11న చలో తిరుపతి





**పెన్ పవర్ జనవరి 8**ఏపీ విద్యుత్ బిసి ఉద్యోగుల 19 వ రాష్ట్ర మహాసభ తిరుపతి లోని ఎస్.ఎస్.బి కళ్యాణ మండపం నందు జనవరి 11వ తేదీ శనివారం 11 గంటలకు జరుగుతుంది అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,రాజ్యసభ సభ్యు లు ఆర్. కృష్ణయ్య ప్రకటించారు. విశాఖ లోని పెదవాల్తేరు అన్నపూర్ణ కాంప్లెక్స్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్. కృష్ణయ్య, ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితా పాల్గొంటారని విద్యుత్ బిసి ఉద్యో గుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యకులు వీరభ ద్రయ్య తెలిపారు.ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, వచ్చే పార్లమెంటు సమావేశాల్లో రా జ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల ఉద్యమానికి బీసీ ఉద్యోగులు నాయకత్వం వహించాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగులు ఐకమత్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అ నంతరం బిసి నేత పితాని ప్రసాద్ మాట్లాడుతూ దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలు కులాల పేరు మీద విడిపోవడం వలన న్యాయ మైన డిమాండ్లు సాధించలేకపోతు న్నారని. బీ సీ లలో భావధ్యనం భానిస ఆలోచన విధానం పోవాలన్నారు.బిసి నేత దబ్బిరు కుమార స్వా మి మాట్లాడుతూ బీ.సీ.లు తెగించి పోరాడ కపోతే భానిస బ్రతుకులు, బిక్షపు బ్రతుకులు బ్రతక వలసి వస్తుందాని హెచ్చరించారు. 75 సంవత్సరాల తరువాత రాజ్యాంగ బద్దమైన హక్కులు కల్పించకపోతే ఇదేమి ప్రజా స్వామ్య మని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం రవి కుమార్.. యూత్ ప్రెసిడెంట్. వి. శ్యాం సుందర్. అన్నజిరా వు. పెద్దిరెడ్డి రాజశేఖర్. భాస్కర్. నాయుడు. రవి. తదితరు

## లోతుగెడ్డ, లంబసింగి కార్యదర్శులకు విధులకు హాజరుకానుందున షోకాజ్ నోటీసులు .

● పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్.



**చింతపల్లి పెన్ పవర్ జనవరి 8:-** ఈ నెల 4వ తేదీ నుండి విధులకు గైర్హాజరు అవుతున్న లోతుగెడ్డ పంచాయతీ కార్యదర్శి సి. హెచ్. రవికుమార్ తో పాటు, పారిశుధ్య నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన లమ్మసింగి పంచాయతీ కార్యదర్శి పి.అప్పలరాజుకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పి ఎస్. కుమార్ చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావును ఆదేశించారు. వారి సంజాయిషీ సంతృప్తికరంగా లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.బుధవారం లోతుగెడ్డ, లమ్మసింగి గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందిని నియంత్రించవలసిన పంచాయతీ కార్యదర్శులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు కార్యాలయ పనివేళలు పాటించాలని,పన్నుల వసూళ్లు, పారిశుధ్యం మెరుగుపరచడం, త్రాగునీటి వనరుల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు ఆధారంగా మాత్రమే జీతభత్యాలను చెల్లిస్తామని స్పష్టం చేశారు.

# హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పై ప్రభుత్వాల వైఖరి స్పష్టం చేయాలి

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నయ్య పడాల్.



**చింతపల్లి పెన్ పవర్ జనవరి 8:-**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా హైడ్రోపవర్ ప్రాజెక్టు, జీవో నెంబర్ 3 లపై కేంద్ర, రాష్ట్రాలలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాల వైఖరి ఏంటో స్పష్టం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో బుధవారం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు, జీవో నెంబర్ 3 కి చట్టబద్ధత పై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నరేంద్ర మోదీ చేత ప్రకటన చేయించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి, కొయ్యూరు మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి అనుమతి ఇచ్చారని, విద్యుత్ ఉత్పత్తి కోసం అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న రెండు భారీ డ్యాములలో చింతపల్లి మండలంలోని ఎర్ర బొమ్మలు, గొందిపాకల, కొయ్యూరు మండలంలోని పెద మాకవరం, వెలగల పాలెం పంచాయతీలలో సుమారు 32 గ్రామాల గిరిజన ప్రజలు ఈ డ్యామ్ ల నిర్మాణం వల్ల నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉందన్నారు. అదే క్రమంలో అనంతగిరి మండలంలో మరో రెండు డ్యాములను కార్పొరేట్ దిగ్గజం ఆదానికి కట్టబెట్టిందన్నారు. దీనివలన జీడి తోటలు, పంట పొలాలు, గృహాలతో పాటు సర్వస్వం కోల్పోయి గిరిజనులు వలస వెళ్లక తప్పని పరిస్థితి ఉంటుందన్నారు. తాత ముత్తాతల జ్ఞాపకాలను, వారసత్వ సంపద అయిన భూమి, గ్రామాలు మునిగిపోయి దిక్కుతోచని పరిస్థితిలో అగమ్యగోచరంగా గిరిజనుల బతుకులు మారే ప్రమాదం లేకపోలేదు అన్నారు. గిరిజనులను ముంచడానికి కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గే ఆలోచన చేయడం లేదని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతూ అటవీ, పర్యావరణ అనుమతులు కూడా మంజూరు చేశారన్నారు. న్యూ రెన్యుబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లిమిటెడ్ కు ఏకంగా వేలాది ఎకరాల అటవీ ప్రాంతాలను గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని. గిరిజన చట్టాలను తుంగలో తొక్కి పీసా గ్రామ సభ ఆమోదం లేకుండానే 32 గిరిజన గ్రామాలను ముంచే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను రద్దు చేయాలని గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం మోడీ చేత రద్దు చేయించాలని కోరారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న జనసేన, టిడిపి నాయకులు హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని పోటీపడి మరి పత్రిక ప్రకటనలు ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రోజున ప్రకటన ఇచ్చినవాళ్లు ఈ రోజున దానిపై నోరు మెదపడం లేదని ఆరోపించారు. జీవో నెంబర్ 3 రద్దుచేసి సుమారు నాలుగేళ్లు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. జీవో నెంబర్ 3 రద్దు వల్ల ఇటీవలి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పొందవలసిన ఉద్యోగాలన్నీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజనేతరులు పొందుతున్నారని, ఇది గిరిజన ప్రాంతమా, కాదా అనే భ్రమల్లో ఆదివాసి గిరిజనులున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కూటమి నాయకులు గిరిజనులుకాదా,వారి కుటుంబాలకి జీవో నెంబర్ 3 వర్తించదా! అని నిలదీశారు. జీవో నెంబర్ 3 చట్టబద్ధత కోసం మోడీని ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, కిల్లో సింహాచలం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధిత గ్రామాల గిరిజనులు పాంగి చిన్నారావు, మర్రి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలి





## ఎంపీడీవోకు సర్పంచుల వినతి పత్రం

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు,ఈవో పిఆర్డి పాపారావుకు,రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యవర్గ సభ్యులు కుందేరి రామకృష్ణ, లకవరపు పేట సర్పంచ్ కంకిపాటి వీరేంద్రప్రసాద్, పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ తమ పంచాయితీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. 2024 వ సంవత్సరం నవంబర్ 13వ తేదీన రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయడం జరిగింది అని కానీ అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో ఉన్న 16 పంచాయతీలకు గాను ఆరు పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ ఖాతాలో జమ కాలేదు అని, ఈ విషయమై పంచాయతీరాజ్ కమిషనర్ కి కలిసి విన్నవించినప్పటికీ ఇప్పటికీ మా గ్రామ పంచాయతీ ఖాతాలో 15వ ఆర్థిక సంఘం నిధులు జమ కాలేదు అని వినతి పత్రంలో పేర్కొన్నారు. మా మండలం తో పాటు రాష్ట్రంలో సుమారు 405 పంచాయతీలకు పైన పేర్కొన్న తారీకు నుండి ఇప్పటివరకు నిధులు జమకాలేదు అని పేర్కొన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వం తగు బాధ్యత తీసుకొని ఆర్థిక సంఘం నిధులు జమ కాని గ్రామపంచాయతీలకు సంబంధించి 25 కోట్ల రూపాయలను వెంటనే మంజూరు చేయాలని, అలాగే జనవరి నెలలో ఒకటవ తారీఖు 2025 వ సంవత్సరం నాటికి గ్రామపంచాయతీలకు 446 కోట్ల రూపాయలు గ్రామపంచాయతీలో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేసింది కాబట్టి ఆ నిధులను కూడా గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయాలని కోరారు. అలాగే పెండింగ్లో ఉన్న 25 కోట్ల రూపాయలను కూడా గతంలో పడని పంచాయతీ ఖాతాలో జమ చేసి పంచాయితీల అభివృద్ధికి సహకరించాలని వినతి పత్రంలో కోరారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ, సర్పంచ్





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 8:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం వంచుల పంచాయితీ మురగడా పల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ ఆధ్వర్యంలో ఎంపీపీ బోయిన కుమారి మూడు లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో 75 మీటర్ల సీసీ రోడ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జోరంగి సరస్వతి, వైసిపి నాయకులు వనపల రాజేష్, అరడ సత్తిబాబు, పొత్తురు గంగరాజు. కూటమి నాయకులు ముర్ల కోటేశ్వరరావు, పొత్తురు కొండలరావు,చల్లంగి అచ్యుత్. గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముంచంగిపుట్టు మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటన





**పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం**

**జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 08.**పర్యాటక ప్రాంత అభివృద్ధి కి పక్క ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీ కేంద్రంలో పర్యాటక ప్రాంత అభివృద్ధికి ఎంత మేర అనుకూలమో క్షుణ్ణంగా బుధవారం ఆయన పరిశీలన చేశారు. సుజనకోట మత్స్య గెడ్డ పరిసర ప్రాంతాల్లో ఉన్న దీవులను, వ్యూ పాయింట్లను పరిశీలన చేశారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా గిరిజన పర్యటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశాలతో జిల్లా కలెక్టర్ సుజనకోట, డుడుమ జలాశయాల ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు పర్యటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తే గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పొందే అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. జోలపుట్టు గిరిజన ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థునిలకు అందుతున్న విద్యపై ఆరా తీశారు. రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి కృషి చేయాలని ఆదేశించారు. డుడుమ జలాశయం చుట్టుప్రక్కల పర్యటక ప్రాంతం అభివృద్ధికి ఎంతో అణువుగా ఉందని ఆయన అన్నారు. జోలపుట్టు పంచాయతీ లబ్బురు గ్రామ సమీపంలో నిర్మాణ దశలో ఉన్న ఏకలవ్య పాఠశాలను సందర్శించి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని సదరు కాంట్రాక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలన చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో మందులు కొరత లేకుండా చూసుకోవాలని పూర్తి స్థాయిగా మందులు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదవుతున్న మలేరియా టైఫాయిడ్ విష జ్వరాలపై వివరాలు అడిగి తెలుసుకొని, అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన తెలిపారు. అంతకుముందు సుజనకోట పంచాయతీ కేంద్రంలో పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ ను సర్పంచ్ వి రమేష్ ఎంపీటీసీ సుబ్బలక్ష్మి లు గ్రామస్తులు అల్లూరి జిల్లా కలెక్టర్ కు పూల బొకేలతో స్వాగతం పలుకుతూ దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంత అభివృద్ధికు గ్రామస్తులు నుండి వివరాలు అడుగి తెలుసుకొని గ్రామస్తులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. మండలంలో పర్యటనకు విచ్చేసిన అల్లూరి జిల్లా కలెక్టర్ ను సర్పంచ్ దొర నీలకంఠం, వైఎస్ఆర్సిపి అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ:-ఎస్ ఏ ఎన్ చారిటబుల్ ట్రస్ట్ సూరెడ్డిఅప్పలనాయుడు




**చింతపల్లి పెన్ పవర్ జనవరి 8 :-** అల్లూరి జిల్లా చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీలో తిరుపతికి చెందిన పీపుల్ చారెడ్డి వారి ఆర్థిక సహకారంతో నర్సీపట్నం కి చెందిన ఎస్ ఏ ఎన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేశారు. బుధవారం మండలంలోని లంబసింగి పంచాయతీలు చెరువుల వినం, మేఘాలకొండ, బంతి బయలు, రింగుల మెట్ట, భీమనపల్లి, చీకటి మామిడి, టేకుబంధ, వాడగడ్డ గ్రామాలకు చెందిన సుమారు 400 మంది గిరిజనులకు దుప్పట్లను అందజేశారు. గిరి గ్రామాలలో గిరిజనులు చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారని గుర్తించి రగ్గులకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్ ఏ ఎన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబసింగి గ్రామ మాజీ సర్పంచ్ రఘునాథ్ ,గ్రామ పెద్దలు రావుల నూకరాజు ,సరమండ నాగరాజు పలువురు పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధి పథకంపై క్లస్టర్ లెవెల్ సమావేశం:-





**చింతపల్లి పెన్ పవర్ జనవరి 8:-**మహాత్మా గాంధీ జాతి గ్రామీణ ఉపాధి పథకం చింతపల్లి మండలం నందు ఈరోజు క్లస్టర్ లెవెల్ లో చింతపల్లి మరియు జీకే వీధి మండలంకు సంబంధించిన ఎంజిఎన్ఆర్జిఎస్ స్టాఫ్ వీరందరికీ ఉపాధి హామీ పథకం అభివృద్ధి మరియు సుస్థిర ఆస్తులు కల్పన మరియు ప్రతి జాబ్ కార్డుదారునికి 100 రోజుల కల్పన మరియు ప్రతిరోజు 300 రూపాయల కూలి పొందే విధంగా స్టేట్ గవర్నమెంట్ ఆదేశాల మేరకు కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఈరోజు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.ఈ ట్రైనింగ్ నందు ఎంపీడీఓ, ఏ పి డి చింతపల్లి మరియు జీకే విధి మండలాల సంబంధించిన ఏపీవోలు ఈసీలు హాజరు కావడం జరిగింది.

# యూనిటీమాల్' తో చేనేతకు ఊతం

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**

**మాల్ కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన మంత్రి**

**కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మిస్తున్న వెల్లడి**

**5 ఎకరాల్లో రూ.172 కోట్లతో భారీ భవంతి**

**నాలుగు అంతస్తులతో భవన నిర్మానం**

**సీ వ్యూతో చేనేత, హస్త కళల ఉత్పత్తుల షాపు లు,మినీ థియేటర్లు, కన్వెన్షన్ హాలు ఏర్పాటు**

**నగరంలోని ఆప్కో, లేపాక్షి షోరూమ్ సందర్శన**

**లక్ష్యాల మేరకు అమ్మకాలు పెంచాలి : మంత్రి సవిత**







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జనవ రి 08.** :యూనిటీమాల్ నిర్మాణంతో చేనేత, హస్త కళల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించ డంతో పాటు చేనేత కళాకారులకు ఆర్థిక భరోసా లభించనుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సం క్షేమ, చేనేత మరియు జౌళి శాఖామంత్రి ఎస్. సవిత తెలిపారు. బుధవారం ఆమె విశాఖప ట్నంలో రామానాయుడు స్టూడియో పక్కన ఉన్న యూనిటీమాల్ కు కేటాయించిన స్థలాన్ని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణితో మంత్రి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం తో రూ.172 కోట్లతో చేపడుతున్న యూనిటీమా ల్ నిర్మాణ ప్లాన్ గురించి సంబంధిత అధికారుల ను అడిగి తెలుసుకున్నారు.నాలుగు అంతస్తు ల్లో చేపడుతున్న యూనిటీమాల్ ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మించాలని ఆదే శించారు. చేనేత, హస్తకళల ఉత్పత్తులు విక్ర యాలు పెరిగేలా షాపులు నిర్మాణం చేపట్టాల న్నారు. చేనేత, హస్త కళల ఉత్పత్తిదారులకు ఆర్థిక భరోసా కల్పించడానికి చర్యలు తీసుకోవా లన్నారు. వ్యాపారం, వినోదం.యూనిటీమాల్ ను అటు వ్యాపారులకు, ఇటు వినోదానికి ప్రాధాన్య ఉండేలా నిర్మించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. జీ ప్లస్ 4 పద్ధతితో నిర్మిస్తున్న ఈ భవనంలో మొదటి రెండు అంతస్తుల్లో 62 షాపులు ఏర్పాటు చేయనున్నామని, మూడో అంతస్తులు సముద్రాన్ని వీక్షించేలా సీ వ్యూతో పాటు రెస్టారెంట్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. నాలుగో అంతస్తులో కన్వెన్షన్ హాలు తో పాటు రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్లు, రెస్టారెంట్లు వంటి సదుపాయాలు కల్పించనున్న ట్లు మంత్రి తెలిపారు. ఒకే భవనంలో వ్యాపారా లు, వినోదం లభించేలా ఈ నిర్మాణం చేపట్టను న్నట్లు మంత్రి తెలిపారు.రుషికొండ బీచ్, రామా నాయుడు స్టూడియో వంటి పర్యాటక ప్రదేశా లకు పర్యాటకులను ఆకట్టుకునేలా యూనిటీ మాల్ నిర్మించనున్నామన్నారు.అమ్మకాలు పెంచండి.అనంతరం నగరంలోని రామ్ నగర్ లో ఉన్న మోడ్రనైజ్డ్ లేపాక్షి షోరూమ్ ను, సిరిపు రంలో ఉన్న ఆప్కో షోరూమ్ ను మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలను, హస్త కళా రూపాలను పరిశీలించారు. ఏయే వస్త్రాలు ఎంతమేర విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకు న్నారు. రోజువారి అమ్మకాల వివరాలను ఆరా తీశారు. రాబోయే సంక్రాంతిని దృష్టిలో పెట్టుకు ని చేనేత వస్త్రాల విక్రయాలు పెరిగేలా ప్రచారా నికి పెద్దపీట వేయాలన్నారు. చేనేత వస్త్రాలపై ఇస్తున్న రాయితీపై పెద్ద ఎత్తున ప్రచారం చేయా లన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాల మేరకు అమ్మకాలు సాగించాలని మంత్రి సవిత స్పష్టంచే శారు.మంత్రులు అనిత, సంధ్యారాణితో భేటీ

విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి సవిత.మం త్రులు అనిత, గుమ్మడి సంధ్యారాణి మర్యాద పూర్వకంగా కలిశారు.రాష్ట్ర హోం మంత్రి అనిత నివాసంలో వారిద్దరినీ కలిశారు. ఈ సందర్భం గా ముగ్గురు మంత్రులు ప్రస్తుతం రాష్ట్రం నెలకొ న్న రాజకీయాంశాలపై చర్చించుకున్నారు.

ప్రధాని మోడీ సభలో పాల్గొన్న మంత్రి సవిత

ఏయూ మైదానంలో వర్చువల్ విధానంలో విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపనతో పాటు అంకితం చేసే కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడి, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోడికి, సీఎం చం ద్రబాబుకు మంత్రులతో కలిసి ఆమె ఘన స్వాగ తం పలికారు పలువురు ఎమ్మెల్యేలు, పలు శాఖల అధికారులు టీడీపీ నాయకులు, కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్ పి ఎస్ ఎస్ యాప్ పై రైతులకు అవగాహన.






**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 8:** రైతులకు ఎన్ పి ఎస్ ఎస్ యాప్ పై రెండు రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిణి బి జ్యోతి బుధవారం తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, దాని అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెద్దనాపల్లి, యర్రవరం గ్రామాల్లో రైతులకు జాతీయ మిత్ర పురుగు సంరక్షణ యాప్ (ఎన్ పి ఎస్ ఎస్ యాప్) పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రైతులనుఉద్దేశించి ఎం ఏ ఓ జ్యోతి మాట్లాడుతూ ఎన్ పి ఎస్ ఎస్ యాప్ నందు ప్రతీ ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ పొలంలో ఉన్న పురుగు , తెగుళ్ల వివరాలను ఫోటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా నివారణ మార్గాలు తెలుసుకోవచ్చు అన్నారు. పీఎండిఎస్ విత్తనాల సాగు ద్వారా భూసారాన్ని పెంచవచ్చని తద్వారా పంటకు అన్ని రకాల పోషకాలు అందుతాయని తెలిపారు.జీవన ఎరువులు అజోస్పైరిల్లం, రైజోబియం, పాస్ఫో బాక్టీరియా ల వినియోగం ద్వారా చాలా వరకు ఎరువుల వాడకం తగ్గడంతో పాటు నాణ్యమైన పంటను పండించి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుద్ధ సూర్యప్రకాష్ , సుంకర సత్యనారాయణ, గ్రామ నాయకులు బస్వా మహాలక్ష్మి ప్రసాద్, మైరాల కనకరావు , ఉగ్గిన సతీష్, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా చిర్రి బాలరాజు పుట్టినరోజు వేడుకలు





**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జనవరి 8 :**పోలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే చిరి బాలరాజు జన్మదిన వేడుకలు బుధవారం బర్రింకలపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో క్రీడా సంబరాలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్ ,షటిల్, విలువిద్య ,ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రైజ్ మనీ, బహుమతులు అందజేశారు. నియోజకవర్గం లోని నాయకులు, అధికారులు వేలాదిమంది అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్, ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం నియోజకవర్గం జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బొమ్మిడి దయాకర్, మద్దిపాటి వెంకట్ రాజు, బొలిశెట్టి వెంకటేశ్వరరావు, పచ్చమట్ల ధర్మరాజు, డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జీలుగుమిల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, ఏడు మండలాల పాత్రికేయులు, కూటమి నాయకులు ఉన్నారు.

## పదవతరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ



**గోకవరం , పెన్ పవర్, జనవరి 08 :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుకున్న 1986-87 బ్యాచ్ విద్యార్థులచే స్థాపించబడిన చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ద్వారా బుధవారం ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థినీ విద్యార్థులకు యూటిఎఫ్ వారిచే రూపొందించిన 132 స్టడీమెటీరియల్ పుస్తకాలను ను ఉచితంగా అందజేశారు.ఛైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఛైర్మన్ గంగిశెట్టి బాలకోటేశ్వరరావు, ప్రెసిడెంట్ గండి భవాని, సెక్రటరీ కేతమోలు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కోండ్రపు శ్రీనివాసరావు చేతులమీదుగా పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.విద్యార్థులు స్టడీమెటీరియల్ ను సద్వినియోగం చేసుకుని మంచిమార్కులు సంపాదించుకోవాలని స్కూల్ ఛైర్మన్ రత్నాజీ , హైస్కూల్ హెచ్ ఎం పిఎస్ఎన్ రెడ్డి,సిఎఫ్ఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.పదవతరగతి పరీక్షల్లో మండలంలో మొదటిస్థానంలో నిలిచిన స్థానిక హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని చిల్డ్రన్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.కార్యక్రమంలో సిఎఫ్ ఎఫ్ సభ్యులు కర్రి భాస్కరరెడ్డి,యార్లగడ్డ శ్రీనివాసరావు, వైవియస్ గణేష్ ఉపాధ్యాయులు నూకరాజు, రాంబాబు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాలం చెల్లిన పెరుగన్నం తిని చిన్నారికి అస్వస్థత






- హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- విక్రయ దారునిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 08.**కాలం చెల్లిన పెరుగు అన్నం తిని ఏడేలా చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురి అయింది. హుటాహుటిన ఆసుపత్రి తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. అమాయక గిరిజనులను ఆసరాగా చేసుకొని అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని గల దుకాణదారులు కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తూ గిరిజనుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. గతంలో దుకాణదారులు కాలం చెల్లిన శీతాల పానీయాలు, మజ్జిగ, పెరుగు విక్రయిస్తున్నారని పలుమార్లు వార్త కథనాలను ప్రచురించినప్పటికీ జిల్లాస్థాయి విజిలెన్స్ అధికారులు తూతు మంత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. జిల్లా విజిలెన్స్ అధికారులు దుకాణదారులపై చర్యలు తీసుకోకపోవడంతో పట్టి పట్టనట్టుగా వ్యవహరిస్తూ విచ్చలవిడిగా కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలోని గల కిరాణా దుకాణంలో 15 రోజుల కాలం చెల్లిన విశాఖ డైరీ పెరుగు ప్యాకెట్టు మంగళవారం కొనుగోలు చేసి తన కుమార్తెను తినిపించగా వాంతులు, విరోచనాలతో అస్వస్థకు గురైందని బుధవారం గిరిజనుడు మొసియ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో మండల కేంద్రంలో గల వరలక్ష్మి జనరల్ స్టోర్ ప్రభాకర్ కిరాణా షాపులో పెరుగు ప్యాకెట్టు కొనుగోలు చేసి ఇంటికి తీసుకుని వెళ్లి తన ఏడు సంవత్సరాల చిన్నారికి పెరుగన్నం పెట్టడంతో కొద్ది నిమిషాల తర్వాత అస్వస్థకు గురి కావడంతో హుటాహుటిన స్థానిక సిహెచ్ సి కు తీసుకువెళ్లి వైద్య సేవలు అందించానని ఆయన అన్నారు.పెరుగన్నం పెట్టడం వల్ల ఎందుకు ఇలా జరిగిందని పెరుగు ప్యాకెట్టు పరిశీలించగా గత నెల డిసెంబర్ 25 తేదీ 2024న తయారైనట్టుగా పెరుగు ప్యాకెట్లు ఉన్నట్లుగా గుర్తించానని ఆయన తెలిపారు. ఈ విషయంపై సదరు వ్యాపారికి వెళ్లి అడిగితే మీ దగ్గర కొనుగోలు చేసిన పెరుగు ప్యాకెట్టు కాలం చెల్లిందని అది మా పాపకు మా పాపకు పెట్టడంతోనే మా పాప అస్వస్థకు గురై ఆసుపత్రికి పాలైందని ఆయనను అడగగా సదరు యజమాని బుకాయించడంతో మీరు లేనప్పుడు మీ నాన్న దగ్గర కొన్నానని మీ నాన్నకు పిలిపించండి అని చెప్పటంతో యజమాని నోట సమాధానం రాలేదని అన్నారు. మండల కేంద్రంలో కాలం చెల్లిన నిత్యవసర సరుకులు అమ్ముతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జరగరానిది జరిగితే షాప్ యజమాని పూర్తి బాధ్యత వహించాలని ఈ విషయంపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు చేపట్టి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని సుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని వేడుకొన్నారు. గతంలో అనేకమార్లు కాలం చెల్లిన శీతాల పానీయాలు సేవించి అస్వస్థతకు గురైన సందర్భాలు అనేక ఉన్నప్పటికీ సంబంధించి అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు బాహాటంగా మాట్లాడుకుంటున్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీకి ఆత్మీయ వీడ్కోలు






**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ విశాఖపట్నం, జనవరి 08:** విశాఖపట్నంలో వివిధ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాలు ముగించుకొని తిరిగి రాత్రి పయనమవుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐఎన్ఎస్ డేగలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు సాదర వీడ్కోలు పలికారు. వీడ్కోలు పలికిన వారిలో పార్లమెంటు సభ్యులు భారతీయ జన తా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి. పురంధేశ్వరి, జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్, నగర పోలీసు కమీషనర్ శంక బ్రతా బాగ్చి, శాసన సభ్యులు బగ్గ రమణమూర్తి మూర్తి, కెఎస్ఎన్ రాజు, ఆర్ వివిఎస్ కెకె రంగారావు, బోనెల విజయ చంద్ర, టి. జగదీశ్వరి, మామిడి గోవిందరావు, ఎంఎల్సీ దువ్వారపు రామారావు, ఎన్టీఆర్ వైద్య సేవ అధ్యక్షులు సీతంరాజు సుధాకర్, టిడిపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ నజీర్, శ్రీకాకుళం జిల్లా బిజెపి అధ్యక్షుడు బి. ఉమామహేశ్వరరావు, కార్పొరేట ర్ ఎం. దేముడు, లీగల్ సెల్ కన్వీనర్ డి. నూక రాజు, బిజెపి మండల అధ్యక్షులు ఎం. కాళేశ్వర రావు, పాత గాజువాక బిజెపి మండల అధ్యక్షు లు డి. పావని, బిజెపి రాష్ట్ర కన్వీనర్ కె. బంగా రు బాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.





# గత పాలకులు నీటిపారుదల రంగాన్ని నిర్ల క్ష్యం చేశారు...





- నీటి సంఘాల ప్రతినిధులారా బలోపేతానికి నడుంబిగించండి....
- నీటి సంఘాల ఆత్మీయ సమ్మేళనం లో ఎమ్మెల్యే నల్ల మిల్లి...

**అనపర్తి,పెన్ పవర్,జనవరి 8:** ఉభయగోదావరి జిల్లలకు దవళేశ్వరం వద్ద ఆన కట్టను కట్టి ఆంధ్రప్రదేశ్ ను అన్న దాత గా నిలపిన కాటన్ మహాశయుడు రూపొందించిన దవలేశ్వర ఆనకట్టను పరిరక్షించుకోవాల్సిన భాద్యత పాలన సాగించే ప్రభుత్వాలపై ఉంది. అయితే గత ఐదేళ్ళ రాక్షస పాలన సాగించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో రాష్ట్రంలోని రైతాంగం తీవ్ర అగచాట్లు పడుతున్నారని ఇబ్బందులు పడిన రైతుల ఉసురు గత పాలకులకు తప్పదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బిక్కవోలు మండలం బలభద్రపురం ఎమ్మెస్సార్ కెళ్యాణ మండపంలో సాగు నీటి సంఘాల ప్రతినిదుల నుంచి ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థాయి వరకు ఆశాఖ ఉన్నతాధికారులతో కలసి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో డెల్టా కాలువలకు, డ్యామ్ లకు, బ్యారేజికి, గేట్లుకు కానీస నిర్వాహరా జరగలేదని దానివలన 175 గేట్లు ఉన్న దేవవేశ్వరం బ్యారేజీలో 115 గేట్లు ప్రమాదంగా మారాయని, వాటిని మరమ్మత్తులు చేయా లని ఆనాటి జగన్ ప్రభుత్వాన్ని కేంద్ర జలవనరుల శాఖ హెచ్చరించినా కనీసం పట్టించు కోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెను వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబందిత దస్త్రాలను, తెప్పించి అధికారులతో మాట్లాడితే బ్యారేజీ నిర్వహణ చేయకపోతే భవిద్యతలో ప్రమాదం లోంచివుందని తెలిపారు. చంద్ర బాబు స్పందించి ప్రపంచ బ్యాంకు ద్వారా 200 కోట్లు రూపాయలు రుణం తీసుకుని ప్రమాదంలో ఉన్న వాటిని ప్రాదాన్యతాక్రమంలో మరమ్మత్తులు చేస్తూ రానున్న నాలుగేళ్ళ కాలంలో అవసరమయ్యే నాలుగు వేల కోట్ల రూపాయలను వెచ్చించి నీటి పారుదల రంగాన్ని బలోపేతం చేయడానికి కంకణ బద్దమై కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కునారిల్లిన సాగు నీటి రంగాన్ని బలోపేతం చేస్తూ ఇటురైతులకు అటు ప్రభుత్వానికి వారధుల్లో వ్యవహరించి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. పంటకాలువలలో కనీసం తూడు కూడా తోలగించని జగన్ ప్రభుత్వం చేసిన ఇబ్బందులను ఒక్కటిక్కటిగా అధిగమిస్తూ రైలు సేవలో తరించాలని రైతు ప్రతినిధులకు సూచించారు. తాను గెలిచి పదవీ ప్రమాణం చేయకుండానే రైతు సాగినీటి సమస్యలతో తన ఇంటికి వచ్చారని వారి ఆవేదన చూసి అధికారులతో మాట్లాడి తూడు, తుప్పలను తోలగించడంతో పాటు రైతుల నుంచి సేకరించిన దాన్యానికి సొమ్ములు రావడంలేదనే విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళడం, ఆయన సీరియస్ గా స్పందించి బకాయి గా ఉన్న 1600 కోట్లను రెండు విడుతలుగా రైతుల ఖాతాలలో జమచేయడం ఒరిగిందన్నారు. గడచిన తొలకరి లో ధాన్యం అమ్ముకును రైతులకు 24 గంటల లోనే సోమ్మును జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వాని దేనన్నారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు సునీల్ కుమార్ నాయుడు, తమలంపూడి సుధాకరరెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పెద్దలు, తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతు సేవలో పునీతులమవుతామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారి రామకృష్ణారెడ్డి, డిసి. కమిటి అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్న సభలో ప్రాజెక్టు కమిటీ అధ్య, ఉపాధ్యక్షుల సారధ్యంలో ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాలు డి.సి. కమిట అధ్యక్షులను సత్కరించారు.



## కోడి కత్తులు తయారీదారులపై ప్రత్యేక నిఘా.

ఒక వ్యక్తి అరెస్ట్, 160 కోడి కత్తుల స్వాధీనం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 8:** కోడి కత్తులు తయారీదారులపై ప్రత్యేక నిఘా ను ఏర్పాటు చేసినట్లు పెద్దాపురం డి.ఎస్.పి డి. శ్రీహరి రాజు అన్నారు. స్థానిక కాలేజీ రోడ్లో కోడి కత్తుల తయారు చేస్తున్నారనే సమాచారం అందడంతో ప్రత్తిపాడు సిఐ బి సూర్య అప్పారావు, ఏలేశ్వరం ఎస్సై ఎన్ రామలింగేశ్వరరావు కాలేజీ రోడ్డు దిబ్బల పాలెం లో బుధవారం రైడ్ చేసి ఎదురాడ మల్లేశ్వరరావు అనే వ్యక్తి వద్ద నుండి కోడి పందాలకు ఉపయోగించే 160 కోడి కత్తులను స్వాధీనపర్చుకుని, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగలు సందర్భంగా జరిగే కోడి పందాలు, జూదం వంటి వాటిని అరికట్టుట లో భాగంగా కోడిపందాలు, జూదం నిర్వహించే వారిపైన, కోడి కత్తులు తాయరీ దారులపైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అందులో భాగంగా ఈరోజు ఏలేశ్వరం గ్రామానికి చెందిన ఎదురాడ మల్లేశ్వరరావు అను వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి 160 కోడి కత్తులను స్వాధీనపర్చుకున్నామని, ఇది ఒక హెచ్చరిక అని, అదేవిధంగా ప్రజలు కోడి పందాలు, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యులతో సంక్రాంతి జరుపుకోవాలని ప్రజలకు డి.ఎస్.పి సూచించారు.

## విద్యుత్తు సౌకర్యం లేని గిరిజనుల గ్రామాలు

- పంచాయితీ సర్పంచ్,పిట్టా రామారావు





**వి.ఆర్.పురం పెన్.పవర్.జనవరి.8** మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయితీ పరిధిలోని సున్నంమట్టా,ధర్భలంక,గిరిజన గ్రామాల్లో బుదవారం చిన్నమట్టపల్లి పంచాయితీ సర్పంచ్,పిట్టా రామారావు పర్యటించి,గిరిజనులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అటవీ గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసులకు విద్యుత్తు లేక పోవడంతో వెలుతురు కోసం గవర్నమెంట్,వారు సోలార్, భ్యాటీరీలు ఏర్పాటు చేశారు.గ్రామాల్లో ఏర్పాటు భ్యాటీరీలు కొన్ని సంవత్సరములు తర్వాత సోలార్,ద్వారా చార్జింగ్,అవక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు.పది సంవత్సరముల నుండి గిరిజనులు చీకటిలో జీవిస్తున్నారు.రాత్రి సమయంలో విష సర్పాలు ఆ ప్రదేశంలో తిరుగుతూ ఉంటాయి.వెలుతురులేక పోవడంతో అపాయము కూడా జరగ వచ్చును.స్వాతంత్ర్యము వచ్చి డెబై ఐదు సంవత్సరాలు అయిన కూడా గిరిజనుల గ్రామాల్లో విద్యుత్తు సౌకర్యం లేక పోవడం చాలా బాదాకరమని,అన్నారు.కేంద్ర గవర్నమెంట్,కు పంచాయితీ,తీర్మానాలు చేసి పంపిస్తే గిరిజన గ్రామాలకు అరవై విద్యుత్తు స్థంభాలు వచ్చాయని,గిరిజనుల గ్రామాలకు విద్యుత్తు వెలుతురు ఎప్పుడు వస్తుందో,వేచి చూద్దా ? అటవీశాఖకు సంబందించిన అధికారులు రహదారులు పైన కర్రలు పెట్టుతూ ఇబ్బందులు పెడుతున్నారని,చిన్న మట్టపల్లి పంచాయితీ,సర్పంచ్,పిట్టా రామారావు ఒక ప్రకనలో తెలిపారు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి గిరిజనులు గ్రామాలకు విద్యుత్తు స్థంభాల లైన్,వేయాలని,ప్రభుత్వాన్ని కోరారు.

## ఈ నెల 9 న ఆర్టీసీ డయల్ యువర్ డీఎం కార్యక్రమం



**అమలాపురం రూరల్, పెన్ పవర్, జనవరి, 8**

అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణీకులకు అందిస్తున్న సేవలపై ఈ నెల 9 వ తేదీ గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10:30 నుండి 11:30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రయాణికులు తమ సలహాలు సూచనలను 9581932678 సెల్ నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు అని ఆయన తెలిపారు. అమలాపురం డిపో పరిధి లోని ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## యూరియా కొరత లేదు- అందుబాటులో యూరియా

**సీతానగరం, పెన్ పవర్, జనవరి :8** సీతానగరం మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి కే సూర్య రమేష్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 16,000 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పొగాకు, అరటి, కూరగాయలు ఇతర పంటలు సాగు చేయబడుతుందని. ఈ రబీ సీజన్లో ఈ మార్చి నెలాఖరి వరకు వీటికి సుమారు 4150 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటికే 2800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని వాటిలో 2,650 మెట్రిక్ టన్నులు రైతులు తీసుకోగా ఇంకా 150 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలియజేశారు, పంటలకు మూడు నుంచి నాలుగు దఫలుగా యూరియా వేయడం జరుగుతుందని ఎప్పుడైతే యూరియా దొరకడం లేదు అని వదంతులు రావడంతో పంటకు ఆ సీజన్ కి సరిపడా యూరియా ఒకేసారి కొనుగోలు చేయడంతో కృత్రిమ కొరత ఏర్పడుతుందని ఆ విధంగా ఎవరు యూరియా ఒకేసారి కొనుగోలు చేయవద్దని మరో మూడు నాలుగు రోజుల్లో సుమారు 300 నుంచి 400 మెట్రిక్ టన్నులు కూడా మండలానికి వస్తుందని రైతులు అధైర్య పడద్దని మండలంవ్యవసాయ శాఖ అధికారి తెలిపారు,

## ఆరోగ్యశ్రీకి మంగళం పాడాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం



- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొండేటి ఆరోపణ

**అమలాపురం రూరల్, పెన్ పవర్, జనవరి, 8:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వారిని కాంగ్రెస్ పార్టీ నాయకులు తో కలిసి వినత పత్రం అందజేసారు. ఈ సందర్భంగా కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఆరోగ్యశ్రీ అని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్.వైయస్ రాజశేఖర్ రెడ్డి మానస పుత్రిక అని అన్నారు. ఈ పథకం ప్రాణాలు తీసే జబ్బు వచ్చినా సంజీవని లాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని కూటమి సర్కారు అనారోగ్య శ్రీ మార్చినది అని అన్నారు. మూడు వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా వైద్య సేవలు నిలిచే దాకా చూడటం అంటే పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారు అని, ఇదంతా ఆరోగ్యశ్రీ పథకాన్ని మంగళం పాడి ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని, ఆరోగ్యశ్రీ నిర్వీర్యం చేస్తూ వదిలించుకునే ప్రయత్నం చేస్తున్నారు అని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బకాయిలు గత ప్రభుత్వం పెండింగ్లో పెట్టినవి అయినా వాటిని చెల్లించే బాధ్యత మీ ప్రభుత్వం పైనే ఉంది. వెంటనే ఆసుపత్రి యజమాన్యులను చర్చలకు పిలిచి పెండింగ్ బకాయిలు మూడువేల కోట్లు తక్షణం విడుదల చేయాలని ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధించి పథకానికి ఏ లోటు రాకుండా చూడాలని జిల్లా అధ్యక్షులు పార్టీ తరఫున డిమాండ్ చేశారు. లేనిచో జిల్లా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా మీడియాకు కొండేటి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితపత్తుల సుభాషిణి, ఏ సి సి మెంబర్ యాలగడ్డ రవీంద్ర, పిసిసి మెంబర్ మాచవరపు శివన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గెడ్డం సురేష్ బాబు, ముషణి రామకృష్ణ రావు, వడ్డీ నాగేశ్వరరావు, బొంతు రాజేంద్రప్రసాద్, నెల్లి వెంకటరమణ, ఆదుర్తి నారాయణమూర్తి కొండేటి వెంకటేశ్వరరావు, దొమ్మేటి వినోద్, ఏలేశ్వరం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు జనతా పార్టీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



**కాకినాడ, పెన్ పవర్ జనవరి 08:** కాకినాడ కాపు కల్యాణ మండపంలో, తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా ను నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది వేల మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరైయ్యారు. ఐదు వేల ఉద్యోగాలు ఇవ్వడానికి సుమారుగా యాభై నాలుగు కంపెనీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, వైసీపీ నాయకులు, తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వర రావు మరియు అన్ని పార్టీ నాయకులు మరియు బీజేపి సీనియర్ నాయకులు జ్యోతుల రాజేష్, జున్నూరి శ్రీహరి, వైసీపీ నాయకులు సుందరపల్లి గోపాలకృష్ణ వాసంశెట్టి రాజేశ్వరరావు మరియు ప్రకృతి వైద్య నిపుణులు నున్నా వీరబాబు, మునగాల సాయి గోపి, రమణ, నున్నగుప్పల వెంకట నరేష్, పితాని శ్రీనివాస రావు, చువ్వకుల గణేష్,కర్రి శివ, తెలుగు జనతా పార్టీ ప్రకాశం జిల్లా నుండి ముత్యాల రామకోటీశ్వరావు, పిల్లి శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**రావులపాలెం పెన్ పవర్ జనవరి 8:** మండలంలో కొమరాజు లంక బస్టాండ్ లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై రావులపాలెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు. అమలాపురం నుండి రావులపాలెం వచ్చే మార్గంలో కొమరాజులంక గ్రామ సమీపంలో బస్టాండ్ వద్ద సుమారు 30 నుండి 35 సంవత్సరాలు ఉండవచ్చు స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసిన పోలీసులు మృతుని వివరాలు తెలియవలసి ఉందని రావులపాలెం ఎస్ హెచ్ ఓ రావులపాలెం ఎస్సై చంటి గుర్తుతెలియని మృతి దేహం గుర్తుపట్టేందుకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ లో ఉంచినట్లు తెలిపారు.

# ఆగని రేషన్ బియ్యం దందా



**విజయవాడ, జనవరి 8, పెన్ పవర్:** సీజ్ ద షిప్ డ్రామా ముగిసింది. రేషన్ బియ్యం పట్టుబడిన స్టెల్లా నౌక కాకినాడ పోర్టు విడిచిపోయింది. రేషన్ బియ్యం అక్రమాలు మాత్రం ఆగలేదు. కొద్ది నెలల క్రితం చోటు చేసుకున్న హంగామాతో రేషన్ బియ్యం ధర మాత్రం కిలోకు రెండు రుపాయలు పెరిగింది ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేస్తామంటూ చేసిన హంగామా ప్రకటనలకే పరిమితం అయ్యింది. ఊరురా రేషన్ బియ్యం అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పోర్టుల్లో తనిఖీలు, మిల్లుల్లో సోదాలతో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు అడ్డు కట్ట పడుతుందని భావించినా అందుకు భిన్నంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఉంది. గతంలో దొంగచాటుగా సాగిన వ్యవహారం ఇప్పుడు బహిరంగంగానే సాగుతోంది. ఊరురా మొబైల్ డెలివరీ యూనిట్లలోనే బియ్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. గతంలో సివిల్ సప్లైస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తారనే భయం కాస్తో కూస్తో ఉండేది. ప్రస్తుతం ఆ భయం కూడా పోయింది.ఏపీలో మూడు నెలల క్రితం రేషన్ బియ్యం అక్రమ తరలింపు వ్యవహారాలపై జరిగిన హంగామాతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపారానికి అడ్డుకట్ట పడుతుందని భావించారు. కాకినాడ పోర్టులో పవన్ కళ్యాణ్ సీజ్ ద షిప్ ఎపిసోడ్‌తో ఈ దందాకు అడ్డుకట్ట పడినట్టే అనుకున్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా తనిఖీలు చేసిన స్టెల్లా నౌకకు సైతం కస్టమ్స్ క్లియరెన్స్ లభించడంతో సోమవారం బయల్దేరి వెళ్లిపోయింది.రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపారాల సిండికేట్లు చేతులు మారినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రతి జిల్లాలో మండలాల వారీగా రేషన్ దుకాణాలను నడిపించే అక్రమ సిండికేట్లలో కొత్త ముఖాలు ప్రవేశించాయి. ఇప్పటి వరకు ఈ తరహా దందాలు నడిపిన వ్యక్తుల చేతుల్లోంచి కొత్త వ్యక్తులు వాటిని దక్కించుకున్నారు. ప్రతి మండలంలో ఉన్న రేషన్ దుకాణాలను అధికార పార్టీల నేతల అనుచరులు తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ప్రభుత్వం పేదల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తినడానికి వినియోగించే సన్న రకాలు కాకపోవడంతో రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ లెక్కల ప్రకారం కోటి 55లక్షల కుటుంబాలు ఉంటే అందులో కోటి 48లక్షల మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి ఒక్కరికి నెలకు 5 కేజీల చొప్పున బియ్యం పంపిణీ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న కార్డులకు బియ్యం పంపిణీ కోసం ఏటా 30లక్షల టన్నుల బియ్యం అవసరం అవుతున్నాయి. వీటిలో 80శాతానికి పైగా పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ఒక్కో కిలో బియ్యం సేకరించి కార్డులకు అందించడానికి రూ.43.50ఖర్చు చేస్తుంటే ఆ బియ్యాన్ని రూ.10-12కు అమ్మేస్తున్నారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం హడావుడి మొదలయ్యాక ఆ ధర రూ.2మేరకు పెంచి కొనుగోలు చేస్తున్నారు.ప్రస్తుతం ఏపీలో కోటి 48లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నవాయి. వీటిలో 92లక్షల కార్డులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రేషన్ అందుతోంది. మరో 56లక్షల కార్డుల్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. రేషన్ కార్డులకు అందించే బియ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.5700కోట్లను వెచ్చిస్తోంది. కేంద్రం ఇచ్చే వాటాతో కలిపితే అది రూ.13వేల కోట్లకు చేరువలో ఉంటుంది. రేషన్ కార్డులతోనే ఆరోగ్యశ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట?, డిబిటి పథకాలను ముడిపెట్టడంతో ఏదో ఒక మార్గంలో రేషన్ కార్డును దక్కించుకుకుంటున్నారు.చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం అందించే బియ్యాన్ని 90శాతం మంది ఆహారంగా వినియోగించడం లేదు. ప్రభుత్వం బోనస్ కలిపి రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని పేదలకు ఆహారంగా సరఫరా చేస్తోంది. ఇలా కిలోకు రూ.43.50 ఖర్చవుతోంది. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే వారికి 20కిలోల బియ్యం ప్రభుత్వం రైస్ కార్డుపై ఇస్తోంది. అంటే నెలకు ఒక్కో కుటుంబానికి రూ.870 ఖరీదైన బియ్యం అందుతోంది.అదే బియ్యాన్ని కార్డు దారుడు తీసుకోకుండా రేషన్ దుకాణాలు, మొబైల్ వాహనాలకే వదిలేస్తే కిలోకు రూ.10-12 కార్డుదారుడికి చెల్లిస్తున్నారు. కార్డులో నలుగురు సభ్యులు ఉంటే బియ్యంకు బదులుగా రూ.200 వారికి ఇస్తున్నారు.ఏడాదికి సగటున రూ.10,440 విలువైన బియ్యాన్ని రూ.2400కు అమ్మేసుకుంటున్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి నెల 3,24, 797 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ కార్డులకు చెల్లిస్తున్నారు. ఇందులో బీపీఎల్ కార్డులు, ఏపిఎల్ కార్డులు, అంత్యోదయ అన్న యోజన కార్డులు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, మిడ్ డే మీల్స్, అన్నపూర్ణ స్కీమ్, అదనపు ఏపిఎల్ కార్డులు ఉన్నాయి. మొత్తం 3.24లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంలో 80శాతం పైగా తిరిగి బ్లాక్ మార్కెట్లకే వెళుతోంది. ఏడాదికి రూ.25లక్షల టన్నుల బియ్యం ఇలా పోర్టుల నుంచి తరలిపోతోంది. దీని ద్వారా నేతలు కళ్లు చెదిరేలా సంపాదిస్తున్నారు.రేషన్ కార్డు దారుల నుంచి రూ.10కు కొనుగోలు చేసే బియ్యాన్ని దళారులు రూ.16-18కు మండల, జిల్లా స్థాయి విక్రేతకు అందిస్తారు. ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం మాఫియాను నియంత్రించే నాయకులు ఉన్నారు. రేషన్ వాహనాలు, దుకాణాల నుంచి బియ్యాన్ని నేరుగా వీరికి అందిస్తారు. ఒక్కో మండలంలో నెలకు సగటున 250-300 మెట్రిక్ టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్లకు తరలిపోతోంది. ప్రతి నెల రెండున్నర లక్షల కిలోల నుంచి 3లక్షల కిలోల బియ్యాన్ని రేషన్ మాఫియా సొమ్ము చేసుకుంటుంది.జిల్లా స్థాయి మాఫియా

నుంచి మద్యం తయారీ దారులు, ఎగుమతి దారులకు చేరే సరికి దాని ధర గరిష్టంగా రూ.36-38కు చేరుతోంది. రేషన్ కార్డుదారుడికి రూ.10 దక్కితే అదే బియ్యం మీద దళారులు కిలోకు రూ.26-28వరకు సంపాదిస్తున్నారు. ఫలితంగా అన్ని రాజకీయ పార్టీలకు రేషన్ బియ్యం మిఠాయిలా మారింది.ప్రభుత్వం మారిన వెంటనే రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించింది. వాస్తవానికి రేషన్ దుకాణాలు, బియ్యం తరలింపు దందా మాత్రమే చేతులు మారింది. గత ఆర్నెల్లలో గతంలో ఉన్న వారి స్థానంలో కొత్త దళారులు పుట్టుకొచ్చారు.ఒక్కో రేషన్ దుకాణంలో ప్రతి నెల లక్షల రుపాయలు ఆదాయం కనిపిస్తుండటంతో చోట మోట నాయకులు తమ ప్రాంతంలో రేషన్ దందా కోసం ముఖ్యమైన నేతల్ని ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ డెలివరీ యూనిట్లతో బియ్యం రవాణా చేస్తుండటంతో బ్లాక్ మార్కెటింగ్ యథేచ్ఛగా సాగుతోంది.

# రేపటి నుంచి వైకుంఠ ద్వారా దర్శనాలు

**10 రోజుల పాటు అవకాశం, భారీ ఏర్పాట్లు చేసిన టీటీడీ**

**తిరుమల, జనవరి 8, పెన్ పవర్:** జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు ఏడు లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ ఈవో జె శ్యామలరావు తెలిపారు. పది రోజుల పాటు ప్రత్యేక దర్శనాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారుసామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడమే తమ అత్యంత ప్రాధాన్యత అని టీటీడీ ఈవో జె శ్యామలరావు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో అడిషనల్ ఈవోతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈవో మాట్లాడారు.

వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై వివరించారు. జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు ఏడు లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు.జనవరి 10 నుంచి 19 వరకు 10 రోజుల పాటు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారం భక్తుల కోసం తెరిచి ఉంటుంది.జనవరి 10న కైంకర్యాల తర్వాత, ప్రోటోకాల్ దర్శనం ఉదయం 4.30 గంటలకు ప్రారంభమవుతుంది. తరువాత 8 గంటలకు సర్వ దర్శనం ప్రారంభం అవుతుంది.వైకుంఠ ఏకాదశి రోజున(జనవరి 10) ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మలయప్ప స్వామి బంగారు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులను అనుగ్రహించనున్నారు.అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాహన మండపంలో మలయప్ప స్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.జనవరి 11న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు.జనవరి 9వ తేదీ ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని 8 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 90 కౌంటర్లు, తిరుమలలో ఏర్పాటు చేసిన ఒక కేంద్రంలో 4 కౌంటర్లలో ఎస్ఎస్‌డి టోకెన్లు జారీ చేయనున్నారు.జనవరి 10, 11, 12 తేదీల్లో భక్తులకు 1.20 లక్షల టోకెన్లు జారీ చేసేందుకు ఈ కింద కేంద్రాలు ఏర్పాటు చేశారు.

1. ఇందిరా మైదాన్.
2. రామచంద్ర పుష్కరిణి.
3. శ్రీనివాసం కాంప్లెక్స్.
4. విష్ణు నివాసం కాంప్లెక్స్.
5. భూదేవి కాంప్లెక్స్.
6. రామానాయుడు ఉన్నత పాఠశాల, బైరాగిపట్టెడ.
7. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓఖీ పల్లి.
8. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుపతిలోని జీవకోన
9. తిరుమల వాసుల కోసం బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్

జనవరి 13-19 వరకు శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో మాత్రమే అదే రోజు దర్శనానికి రోజువారీ ప్రాతిపదికన టోకెన్లు జారీ చేస్తారు. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనం కోసం ఇప్పటికే 1.40 లక్షల ఎస్ఈడీ టిక్కెట్లు, 19,500 శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదలయ్యాయి.

పది రోజుల పాటు ఈ దర్శనాలు రద్దు

ప్రోటోకాల్ వీఐపీలు మినహా, వీఐపీ బ్రేక్ దర్శనం, సీనియర్ సిటిజన్లు, శారీరక వికలాంగులు, శిశువులు ఉన్న తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు వంటి ఇతర ప్రత్యేక దర్శనాలు ఈ పది రోజులలో రద్దు చేశారు. తిరుమలలో పరిమిత సంఖ్యలో వసతి అందుబాటులో ఉన్నందున, దర్శన టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే వారి టోకెన్లపై పేర్కొన్న తేదీ, సమయంలో క్యూ లోకి అనుమతిస్తారు. జనవరి 9న తిరుపతిలో ఎస్ఎస్డీ టోకెన్లు జారీ చేస్తారు.జనవరి 19 వరకు శ్రీవారి మెట్టు కౌంటర్లు మూసి ఉంటాయని టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. ఈ పది రోజుల్లో సిఫారసు లేఖలు స్వీకరించరన్నారు. పది రోజుల పాటు తిరుమలలో వసతి గదుల ఆన్‌లైన్ బుకింగ్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సాధారణ భక్తులకు సీఆర్వోలో వసతి కేటాయిస్తారని తెలిపారు.

12 వేల వాహనాలకు పార్కింగ్

జనవరి 8 నుంచి 11 వరకు 4 రోజుల పాటు తిరుమలలో ఎంబీసీ, ఏఆర్పీ, టీబీసీ, కాటేజ్ డోనర్ స్కీమ్ కేటాయింపు కౌంటర్ల మూసివేయనున్నారు. తిరుమలలో

దాదాపు 12 వేల వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయనున్నారు. ఎంబీసీ, ఔటర్ రింగ్ రోడ్, ఖీఃఉఊ ఏరియా, పరకామణి భవన్ సమీపంలో పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం టికెట్లపై ఎంట్రీ పాయింట్, దిగే పాయింట్, పార్కింగ్ పాయింట్, పికప్ పాయింట్ వివరాలను ముద్రించారు.

వైకుంఠ ద్వార దర్శనాల భద్రతా ఏర్పాట్లపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. యాత్రికుల భద్రత కోసం తిరుపతిలో 1200 మంది, తిరుమలలో 1800 మంది పోలీసులతో కలిపి దాదాపు 3000 మంది పోలీసులను మోహరించినట్లు తెలిపారు. తిరుపతి, తిరుమలలోని అన్ని సర్వ దర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద టీటీడీ సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. తిరుమలలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి నిర్ణీత తేదీ, సమయాన్ని అనుసరించి వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని అభ్యర్థించారు.

# కృష్ణా, గోదావరి నేతల మిస్సింగ్

**విజయవాడ, జనవరి 8, పెన్ పవర్:** అధికారం కోల్పోయాక ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల్లో వైసీపీని నడిపించే నాయకుడు లేడన్న చర్చ ఏపీ పాలిటిక్స్‌లో జోరుగా నడుస్తోంది. ఆ జిల్లాల్లో వైసీపీ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలాగా తయారు అయిందట. వైసీపీ అధికారం చేజారిపోగానే.. బాలారిష్టాలు మొదలయ్యాయి. ఆ జిల్లాల్లో పార్టీని నడిపించే నాయకులు కరువవుతున్నారు.ఒక్కో నాయకుడిని ఏదో ఒక కేసు వెంటాడుతోంది. తెరమరుగైన కేసులను కూటమి ప్రభుత్వం తిరగతోడుతుండడంతో కొందరు వైసీపీ నేతలకు అరెస్టు భయం పట్టుకుంది. ఇందులో ప్రధానంగా మూడు కేసులు వైసీపీ నేతలను ఉక్కబోతకు గురిచేస్తున్నాయి. చంద్రబాబు ఇంటిపై దాడి, మంగళగిరి, గన్నవరం టీడీపీ కార్యాలయాల్లో విధ్వంసం కేసులో పలువురు నేతలు నిందితులుగా ఉన్నారు.ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పలువురు నేతలు టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అజ్ఞాత జీవితమే గడుపుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమ నోటికి పని చెప్పిన మాజీ మంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇప్పుడు ఎక్కడున్నారో తెలియదు. మాజీ మంత్రి కొడాలిపై నమోదైన రెండు కేసుల్లో కోర్టు బెయిల్ మంజూరు చేసినా, ప్రభుత్వం ఇంకేదైనా కేసులో ఇరికించి లోపల వేస్తుందనే భయంతో కొడాలి నాని కనిపించకుండా తిరుగుతున్నారని లోకల్ టాక్.ఇక గన్నవరంలో టీడీపీ ఆఫీస్‌లపై దాడి కేసులో వల్లభనేని వంశీకి అరెస్ట్ తప్పేలా లేదు. చాలా కాలంగా ముందస్తు బెయిల్‌పై ఉన్న వంశీ.. ఇప్పుడు బెయిల్ రద్దు కావడంతో అరెస్ట్ ఖాయమనే గాసిప్ కృష్ణా జిల్లాలో బిగ్ సౌండ్ చేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో వంశీ ముఖ్య అనుచరులు రిమాండ్‌లో ఉన్నారు.

దీంతో వైసీపీ ఓటమి పాలైనప్పటి నుంచి వంశీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఒకటి రెండు సందర్భాల్లో మినహా ఆయన బయట కనిపించింది లేదు. దీంతో గన్నవరంలో ఆరునెలలుగా వైసీపీ జెండా ఎక్కడా కనరావడం లేదు. దీంతో క్యాడర్ అయోమయస్థితిలో పడిపోయింది.ఎన్నికల్లో ఓటమి తర్వాత కృష్ణా జిల్లాలో కీలకమైన అధ్యక్ష బాధ్యతల్ని పేర్ని నానికి అప్పగించింది వైసీపీ అధిష్టానం. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికి, పేర్ని నాని రేషన్ బియ్యం స్కాంలో ఇరుకున్నారు. కేసుల ఎఫెక్ట్‌తో స్పీడ్ తగ్గించేసి కామ్ అయిపోయారు పేర్ని నాని.గన్నవారానికి వల్లభనేని వంశీని, గుడివాడకు కొడాలి నానిని , మచిలీపట్నానికి పేర్ని నానిని ఇన్చార్జులుగా కొనసాగిస్తున్నట్లు జగన్ ప్రకటించినా కేసుల భయంతో ముగ్గురూ క్యాడర్‌కి అందుబాటులో లేకుండా పోయారు. పెడన, పెనమలూరు నియోజకవర్గాల్లో తిరిగి కొత్త వారికి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. వారు కూడా కనిపించడం లేదని వైసీపీ కార్యకర్తలు ఆందోళన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం నియోజకవర్గాన్ని వీడిన వల్లభనేని వంశీ, గుడివాడకు దూరమైన కొడాలి నాని ఇప్పటివరకు ఎక్కడున్నారో తెలియదు. ఎప్పుడొస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొందిఇక గుంటూరు జిల్లా బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మరియమ్మ హత్యకేసులో అరెస్టైన నందిగం సురేశ్.. తన పాత కేసుల వివరాలను దాచిపెట్టారన్న కారణంతో ట్రయల్ కోర్టు ఆయనకు బెయిల్ నిరాకరించింది.

దీంతో సుప్రీంకోర్టు కూడా తాము జోక్యం చేసుకోలేమని చెప్పింది.ఇలా చెప్పుకుంటూ పోతే గుంటూరు, కృష్ణా జిల్లాల నేతలు గడప దాటి అడుగు బయట పెట్టడం లేదట. పార్టీ పిలుపునిచ్చిన కార్య క్రమాలకు సైతం వారు దూరంగా ఉంటున్నారు. చివరకు పార్టీ ప్రతిష్టాత్మకంగా పిలుపునిచ్చిన రైతు సమస్యలతో పాటు విద్యుత్ చార్జీలకు పెంపుదలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనల్లోనూ వారు కనిపించలేదు.ఇలానే కంటిన్యూ అయితే భవిష్యత్తులో పార్టీ పరిస్థితి ఏంటి అని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారంట. రాజకీయాల్లో కేసులు, అరెస్టులు సర్వసాధారణం. కానీ క్యాడర్‌కు భరోసా కల్పించలేని స్థితిలో కీలక నేతలే ఇలా సైలెంట్‌గా ఉంటే భవిష్యత్తులో పార్టీ జండా మోసేదెవరు..? పార్టీ, కార్యక్రమాలకు వచ్చేది ఎవరు, పార్టీని నడిపించేది ఎవరని కార్యకర్తలు పెదవి విరుస్తున్నారని పార్టీ ఇన్నర్ టాక్. మరి చూడాలి ఈ సమస్యని వైసీపీ హైకమాండ్ ఎలా చక్కబెడుతుందో..

## పక్కదారి పడుతున్న కందిపప్పు



**నెల్లూరు, జనవరి 8, పెన్ పవర్:** పేదలకు అందాల్సిన కందిపప్పు పక్కదారి పడుతోంది. చాలా ప్రాంతాల్లో కందిపప్పు సరఫరా తక్కువ అవుతోంది. దీంతో డీలర్లు కొంతమందికే ఇచ్చి.. మిగతా పప్పును వ్యాపారులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 40 శాతం వరకు లబ్ధిదారులకు కందిపప్పు అందడం లేదని తెలుస్తోంది.సంక్రాంతి పండగ వేళ పేదలు కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా కార్డుదారులకు ఇచ్చే సరఫరాలో కోత విధిస్తున్నారు. డిసెంబర్ నెలలో కూడా అరకొరగా పంపిణీ చేశారు. ఈ నెలలో అయినా అందరికీ ఇస్తారని అనుకున్నారు. కానీ పూర్తి స్థాయిలో కిందిపప్పు రాలేదు. కార్డుదారులకు ప్రతినెలా బియ్యంతో పాటు అరకిలో పంచదార, కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. కానీ.. రేషన్ షాపుల ద్వారా అవి సక్రమంగా అందడం లేదు.బియ్యం, పంచదార అందరికీ ఇస్తున్నా.. 50 నుంచి 60 శాతం మందికి మాత్రమే కంది పప్పు అందిస్తున్నారు. దీంతో 40 శాతానికిపై లబ్ధిదారులకు కందిపప్పు దక్కడం లేదు. రేషన్ దుకాణాలు ద్వారా రాయితీపోనూ రూ.67కే కందిపప్పు వస్తుంది. దీంతో పేదలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు భారీగా పెరగడంతో.. కందిపప్పు ఇవ్వకపోతే ఎలా అని పేదలు ప్రశ్నిస్తున్నారు.రేషన్ షాపుల నిర్వాహకులు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు ఇవ్వాలి. కానీ చాల చోట్ల బియ్యం, చెక్కర మాత్రమే అందిస్తున్నారు. కొంత మందికి మాత్రమే కందిపప్పు అందించి.. ఇక పప్పు అయిపోయిందని చెబుతున్నారు. అలా నొక్కేసిన పప్పును బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయిపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా అనేక రకాల అవసరమైన సరుకులు అందజేస్తున్నారు. తెల్ల బియ్యం, గోధుమలు, ప్రోటీన్లు అధికంగా ఉండే కందిపప్పు, పంచదార, వంట నూనెను కూడా అందిస్తున్నారు. అప్పుడప్పుడు అవసరాలను బట్టి ఉప్పు, మిరపకాయలను పంపిణీ చేస్తున్నారు.అయితే.. కొన్ని చోట్ల కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని స్పష్టం చేస్తున్నారు. షాపుల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## రెరా నిబంధనల్ని సరళతరం

**విజయవాడ, జనవరి 8, పెన్ పవర్:** ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందేలా రెరా నిబంధనల్ని సరళతరం చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. విజయవాడలో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కార్యాలయంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి, రెరా ఛైర్మన్ కన్నబాబు,రెరా సభ్యులు, అధికారులతో కలిసి మంత్రి ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.క్రెడాయ్, నరెడ్కో ప్రతినిధులతో పాటు బిల్డర్లు, డెవలపర్లు,ప్రజల నుంచి మంత్రి నారాయణ స్వయంగా వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి పూర్తిగా వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు పెండింగ్ లో ఎందుకు పెట్టాల్సి వచ్చిందో అధికారులను వివరణ అడిగారు.భవనాలు,ప్లాట్లు కొనుగోలుచేసేవారు ప్రకటనలు చూసి మోసపోకుండా ఉండేలా చూడటమే రెరా లక్ష్యమని మంత్రి వివరించారు.కేంద్ర చట్టం ప్రకారం రాష్ట్రంలో 2016లో రెరా చట్టం అమల్లోకి వచ్చిందని అప్పటి నుంచి కేంద్రం ఇచ్చిన నిబంధనలు రాష్ట్రంలో తూ,చ.తప్పకుండా అమలుచేసేలా ముందుకు వెళుతున్నామన్నారు.రెరాలో ఇప్పటివరకూ 167 దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్నాయని కొన్ని దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి 30 మంది క్లయింట్లు, బిల్డర్లు, డెవలపర్లు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చారు.ఆయా దరఖాస్తుల కు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసినట్టు వివరించారు.పెండింగ్ అప్లికేషన్లు అన్నీ ఈ నెలాఖరులోగా క్లియర్ చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన విధానాలను కూడా కొన్ని పరిశీలించామని రెరా నిబంధనలు మరింత సరళతరం చేసేలా కమిటీ వేసి ముందుకెళ్తామన్నారు. రెరా అనుమతులు ఆఫ్ లైన్ లో కాకుండా ఆన్ లైన్ లో జరిగేలా త్వరలో మార్పులు చేస్తున్నామన్నారు.గత ప్రభుత్వంలో బిల్డర్లు,డెవలపర్లుతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు,ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారన్నారని రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరగాలనేది సీఎం లక్ష్యమని...అందుకు అనుగుణంగా భవన,లేఅవుట్ల అనుమతులను సరళతరం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవన నిర్మాణాలకు సంబంధించి కొత్తగా రూపొందించిన నిబంధనలను వచ్చే గురువారం జారీ చేస్తామని మంత్రి చెప్పారు. బిల్డర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.తణుకు,తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరగడంతో వాటితో పాటు కొన్నాళ్లపాటు అన్నిచోట్లా బాండ్ల జారీ నిలిపివేసినట్టు చెప్పారు. తాజాగా ఒకట్రెండు చోట్ల మినహా మిగిలిన అన్నిచోట్లా పెండింగ్ లో ఉన్న టీడీఆర్ బాండ్లను జారీ చేస్తున్నామన్నారు. గత మూడు రోజులుగా ప్రతి రోజూ అన్ని మున్సిపాల్టీల కమిషనర్ లతో టీడీఆర్ బాండ్ల జారీపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారుతణుకులో టీడీఆర్ కుంభకోణంపై విచారణ పూర్తయిన తర్వాత సీఎం చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వాటిలో 321 టీడీఆర్ బాండ్ల వెరిఫికేషన్ పూర్తయిందని, మరో 501 టీడీఆర్ ల వెరిఫికేషన్ జరగాల్సి ఉందన్నారు. విశాఖపట్నంలో 184, తిరుపతిలో 153, కర్నూలు లో 93, గుంటూరులో 120, కాకినాడలో 91, రాజమండ్రిలో 50,కడపలో 46,విజయవాడలో 30తో పాటు ఇతర కార్పొరేషన్ లలో మరికొన్ని పెండింగ్ లో ఉన్నాయన్నారు.మొత్తంగా 822 టీడీఆర్ లకు సంబంధించి ఈనెలాఖరుకల్లా జారీ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు.రాష్ట్రంలో అనధికారిక లే అవుట్లు చాలా వరకూ ఉన్నాయని, ఎక్కడెక్కడ ఎన్నెన్ని అక్రమ లే అవుట్లు ఉన్నాయనే దానిపై ఇప్పటికే ఒక క్లారిటీ వచ్చిందన్నారు. అలాంటి అనుమతులు లేని లే అవుట్ల లో ప్లాట్లు కొనడం ద్వారా కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడతారన్నారు.మరోవైపు భవన,లేఅవుట్ల క్రమబద్ధీకరణపై కోర్డు ఇచ్చిన ఆదేశాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

## దివ్యాంగుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తాం.....

**పెద్దపల్లి ప్రతినిధి: పెన్ పవర్:** దివ్యాంగుల అభ్యున్నతికి జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సంపూర్ణ సహకారం అందజేస్తామని ఎమ్మెల్యే విజయరమణ రావు, ×జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని పెరేడ్ గ్రౌండ్స్ లో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావుతో కలిసి అలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపిక కాబడిన దివ్యాంగులకు 27 లక్షల విలువ గల ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నవంబర్ నెలలో అలింకో సంస్థ ద్వారా క్యాంప్ నిర్వహించి పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అర్హులైన దివ్యాంగుల ను ఎంపిక చేసామని , ఎంపిక కాబడిన దివ్యాంగులకు నేడు 27 లక్షల విలువ చేసే వివిధ ఉపకారణాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగు తుందని అన్నారు. రాబోయే 2 నెలల వ్యవధిలో మరొకసారి క్యాంపు నిర్వహించి ఇంకా ఎవరైనా దివ్యాంగులు పెండింగ్లో ఉంటే వారిని గుర్తించి అవసరమైన పరికరాల పంపిణీకి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాలను ఆర్.బి.ఎస్.కే బృందాలు పర్యటిస్తూ పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తున్నారని, ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించ డం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ.. పాకిస్థాన్ దిగ్గజ క్రికెటర్‌ను మెంటార్‌గా పట్టేసిన ఆఫ్ఘనిస్తాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఛాంపియన్స్ ట్రోఫీ ముందు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఏడేళ్ల తర్వాత జరగనున్న ఈ మెగా టోర్నీకి ఆఫ్ఘనిస్తాన్ జాతీయ జట్టుకు మాజీ పాకిస్థాన్ దిగ్గజ క్రికెటర్ యూనిస్ ఖాన్‌ను బుధవారం( బుధవారం) మెంటార్‌గా నియమించింది. ఈ పాక్ మాజీ క్రికెటర్ ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసేవరకు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు మెంటార్ గా వ్యవహరించనున్నాడు. ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించడం ఇదే తొలిసారి. టోర్నీ పాకిస్థాన్ లో జరుగుతుండడంతో యూనిస్ ఖాన్ సలహాలు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డ్ సీఈఓ నసీబ్ ఖాన్ మాట్లాడుతూ.. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం జాతీయ జట్టుకు తాత్కాలిక మెంటార్‌గా యూనిస్ ఖాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల ఆఫ్ఘనిస్తాన్ సంతోషిస్తున్నట్లు తెలిపారు. కీలకమైన ఈ టోర్నీకి ముందు యూనిస్ ఖాన్ కు శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ లో పాకిస్థాన్ తరపున యూనిస్ ఖాన్ 118 టెస్టుల్లో 52కి పైగా సగటుతో 10,099 పరుగులు చేశాడు. 265 వన్డేల్లో 7,249 పరుగులు, 25 టీ20ల్లో 442 పరుగులు చేశాడు. 2009లో కరాచీలో శ్రీలంకపై ట్రిపుల్ సెంచరీతో పాటు ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ లో నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తొమ్మిదో ఎడిషన్ ఫిబ్రవరి 19 నుండి మార్చి 9 వరకు జరుగుతుంది. పాకిస్తాన్‌లోని లాహోర్, కరాచీ, రావల్పిండి ఎనిమిది జట్లు ఆడే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. భారత జట్టు పాల్గొనే మ్యాచ్‌లు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. భారత్, పాకిస్థాన్‌తో పాటు బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగానే జరిగే అవకాశం ఉంది. ఒకవేళ టీమిండియా నాకౌట్ దశకు అర్హత సాధిస్తే.. యూఏఈలోనే సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

# బోర్డర్-గవాస్కర్ సిరీస్.. పిచ్‌లకు ఐసీసీ రేటింగ్





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇటీవలే ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 5 టెస్ట్ మ్యాచ్ లు ఐదు వేదికల్లో జరిగాయి. ఐదు వేదికల పిచ్ లు ఐసీసీ రేటింగ్ ఇచ్చింది. తొలి నాలుగు టెస్టులు జరిగిన పిచ్ లకు వెరీ గుడ్ అని రేటింగ్ ఇచ్చింది. సిడ్నీ వేదికగా జరిగిన చివరి టెస్టు పిచ్ కు మాత్రం సంతృప్తి కరం అని రేటింగ్ ఇచ్చింది. అన్ని టెస్టులు జరిగిన పిచ్ లకు ఐసీసీ మంచి రేటింగ్ ఇవ్వడం విశేషం. పెర్త్ లో తొలి టెస్ట్.. అడిలైడ్ లో రెండో.. బ్రిస్బేన్ లో మూడో టెస్ట్.. మెల్ బోర్న్ లో నాలుగో టెస్ట్.. సిడ్నీలో ఐదో టెస్ట్ జరిగాయి. 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ను ఆస్ట్రేలియా జట్టు 3-1 తేడాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని గెలుచుకుంది. తొలి టెస్ట్ భారత్ గెలవగా.. ఆ తర్వాత నాలుగు టెస్టుల్లో ఆస్ట్రేలియా మూడు టెస్టుల్లో జయభేరి మోగించింది. బ్రిస్బేన్ లో జరిగిన మూడో టెస్ట్ డ్రా గా ముగిసింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ లో జరగబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్ కు ఆసీస్ అధికారికంగా అర్హత సాధించింది. సౌతాఫ్రికాతో డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడనుంది. మరోవైపు ఈ ఓటమితో భారత్ అధికారికంగా టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ నుంచి నిష్క్రమించింది.పదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గెలవడం విశేషం. చివరిసారిగా 2014-15 లో ఆస్ట్రేలియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గెలుచుకుంది. ఈ సిరీస్ కు ముందు భారత్ వరుసగా నాలుగు సార్లు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గెలుచుకుంది. సిరీస్ మొత్తం బౌలింగ్ లో అద్భుతంగా రాణించిన టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. 2026 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా భారత్ కు రానుంది.

# దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బవుమా రికార్డు... 74 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి



**బవుమా సారధ్యం వహించిన తొలి 9 టెస్టుల్లో ఎనిమిదింట దక్షిణాఫ్రికా గెలుపు**

**ఈ ఘనత సాధించిన రెండవ కెప్టెన్‌గా రికార్డు**

**దిగ్గజ క్రికెటర్ల సరసన నిలిచిన బవుమా**

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా జట్టు టెస్ట్ ఫార్మాట్ కెప్టెన్ తెంబా బవుమా ఈమధ్య అదరగొడుతున్నాడు. పరుగుల వరద పారిస్తున్నాడు. వ్యక్తిగత ప్రదర్శనతో పాటు సారథిగానూ అద్భుతాలు సృష్టిస్తున్నాడు. సఫారీలు ఇటీవల పాకిస్థాన్‌పై 2-0 తేడాతో టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడంతో బవుమా దిగ్గజ ఆటగాళ్ల సరసన చేరాడు. బవుమా కెప్టెన్‌గా వ్యవహరించిన తొలి 9 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా ఏకంగా ఎనిమిది విజయాలు సాధించింది. దీంతో, గత 74 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో బవుమా పేరిట ఒక రికార్డు నమోదయింది. కెప్టెన్‌గా తొలి 9 టెస్టుల్లో అత్యధిక విజయాలు సాధించిన రెండవ ఆటగాడిగా బవుమా నిలిచాడు. తద్వారా... ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్లు వార్విక్ ఆర్మ్‌స్ట్రాంగ్, లిండ్సే హస్సెట్‌ల సరసన చేరాడు.కాగా, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ పెర్సీ చాప్‌మన్ తొలి 9 టెస్ట్ మ్యాచ్‌లు అన్నింటిలోనూ తన జట్టుని గెలిపించి చరిత్ర సృష్టించి అగ్రస్థానంలో నిలిచాడు. 1921లో చాప్‌మన్ ఈ రికార్డు సాధించాడు. ఇదిలావుంచితే, పాకిస్థాన్‌పై టెస్ట్ సిరీస్ గెలుపుతో దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. జూన్ నెలలో ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది.

## సిద్ధి యొక్క డింపుల్స్ మరియు లెహంగా పర్ఫెక్ట్ పెయిర్ మేక్



# దేవర 2.. ఎన్టీఆర్ ఏం చేస్తాడు..?



ఎన్టీఆర్

ఇంట్రెస్టింగ్ స్క్రీన్ ప్లే రాసుకుని ఎన్టీఆర్ ఎనర్జీని పర్ఫెక్ట్ గా వాడుకుంటే దేవర 2 హైలెట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. అంతేకాదు దేవర 1 లో మిస్సైన కొన్ని అంశాలను కూడా పార్ట్ 2 లో జాగ్రత్త పడే ఛాన్స్ ఉంటుంది. దేవరలో జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించింది. ఆమె పాత్ర కేవలం గ్లామర్ కోసమే అన్నట్టు ఉంది. రిలీజ్ ముందు జాన్వి కపూర్ రెండు పేజీల డైలాగ్ అంటూ ఊరించి సినిమాలో అది మిస్సయ్యే సరికి ఫ్యాన్స్ హర్ట్ అయ్యారు.సో దేవర 2 లో ఎన్టీఆర్ తో పాటు జాన్వి కపూర్ పాత్ర మీద ఎక్కువ ఫోకస్ చేయాలి. దేవర 1కి అనిరుద్ మ్యూజిక్ బాగా వర్క్ అవుట్ అయ్యింది. సినిమా ఈ రేంజ్ సక్సెస్ కు కారణం తెర మీద తారక్ తెర వెనక అనిరుద్ మ్యూజిక్ అన్నట్టు చేశాడు. సో దేవర 2 మీద అతను కూడా హార్డ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. ఐతే ప్రస్తుతం ఎన్టీఆర్ వార్ 2 చేస్తున్నాడు. నెక్స్ట్ ప్రశాంత్ నీల్ తో సినిమా సెట్స్ మీదకు వెళు _ంది. ఆ రెండిటితో పాటు దేవర 2 కూడా చేయాల్సి ఉంటుంది. దేవర 2 కొంత భాగం రష్ ఉంది. సో సినిమా పార్ట్ 1 కి పట్టిన టైం పట్టకపోవచ్చు కానీ ఎన్టీఆర్ ఆ సినిమాకు డేట్స్ ఇవ్వాల్సి ఉంది. అది ఎప్పుడు జరుగుతుందో చూడాలి.

కొరటాల శివ కాంబోలో వచ్చిన దేవర పార్ట్ 1 ఫస్ట్ షో టాక్ బాగా లేకపోయినా తారక్ స్టామినాతో ఎలాగోలా సినిమాను లాక్కొచ్చేశాడు. ప్రాఫిట్స్ అండ్ లాస్ విషయాలను పక్కన పెడితే ఎన్టీఆర్ దేవర ఫ్యాన్స్ కి మంచి జోష్ ఇచ్చింది. %===% లో ఎన్టీఆర్ నటించినా కూడా సోలోగా వచ్చి చాలా రోజులు అవుతున్న కారణంగా ఫ్యాన్స్ ఎన్టీఆర్ కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు. ఐతే దేవర అనుకున్నంత రేంజ్ కాకపోయినా ఆడియన్స్ ని అలరించింది. ఐతే ఈ సినిమా పార్ట్ 2 కూడా ఉందని తెలిసిందే.

సినిమా సూపర్ హిట్ అయితే పార్ట్ 2 ఎప్పుడా అన్న ఎగ్జైట్ మెంట్ ఉండేది కానీ దేవర 1 ఫైనల్ గా యావరేజ్ సినిమాగా నిలవడంతో పార్ట్ 2 మీద అంత గురి లేదు. ఫ్యాన్స్ కూడా పార్ట్ 2 గురించి అడగట్లేదు. అసలు దేవర 2 కథ ఏముంటుంది. ఎలాగు పార్ట్ 1 లోనే దేవర మృతిచెందాడని చూపించాడు.. కానీ అతన్ని చంపింది ఎవరు అన్నది పార్ట్ 2 లో చూపించాల్సి ఉంటుంది. మరోపక్క అజయ్ వెతుక్కుంటూ వచ్చిన పాత్ర ఏమైంది ఆ కథ కూడా పార్ట్ 2 లోనే ఉంటుంది. చెప్పడానికి చిన్న కథ ఉన్నా దానికి




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com